
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 10.04.2015, శుక్రవారం సంపుటి : 34 సంచిక : 45 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

# కమ్మర్షియల్ రాజధాని!



- రాజధాని చుట్టూ రియల్ వ్యాపారం
- ఒక వర్గం ఆధిపత్యం కోసం పాకులాట
- సింగపూర్ కంపెనీలకు ధారాదత్తం

*సింగపూర్ రాజధాని...*

*సింగపూర్ రాజధాని... రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు నిద్రపోతే ఇదే కల, నిద్రలేస్తే ఇదే కలవరింత. ఒక కొత్త రాజధాని నిర్మాణం కోసం ఇంతగా తపన పడిన నాయకుడిని చరిత్రలో చూడలేదేమో! రాజుల కాలంలో కూడా రాజధానులు కట్టడం గురించి చదివాంగాని, కాకపోతే వాళ్లు ఒక కోట లాంటిది కట్టుకుని వదిలేసేవాళ్లు. కాని చంద్రబాబు రాజధాని పేరుతో సింగపూర్ లాంటి ఒక దేశాన్నే కట్టాలనుకుంటున్నాడు. సింగపూర్ అనేది దాదాపు 60ఏళ్లలో నిర్మితమైన నగరంలాంటి ప్రత్యేక దేశం. చంద్రబాబు అలాంటి దేశాన్ని ఆంధ్రాలో కేవలం తన పాలనా కాలంలోనే పూర్తి చేయాలనుకుంటున్నాడు.*

చంద్రబాబు సింగపూర్ రాజధాని ప్రయత్నం చాలా మందికి పిచ్చిపనిగా అనిపిస్తుంది. వేల ఎకరాల పచ్చటి పంటపొలాలను నాశనం చేసి, లక్షలాది మంది రైతుల, రైతుకూలీల కడుపుకొట్టి ఇలాంటి రాజధానిని నిర్మించాల్సిన అవసరముందా? అని మేధావులు, సామాజికవేత్తలే కాదు, సామాన్య ప్రజలు కూడా ప్రశ్నిస్తున్నారు. అసలే రాష్ట్రం (మిగతా 10వ పేజీలో)

## • నెల్లూరు ప్రగతికి బ్రేక్...

త్వరలో

# బాలాజీ జిల్లా



*రాజకీయ నాయకులు సాధారణంగా తమ ప్రత్యర్థుల మీద పగ పెంచుకుంటుంటారు. అంతేగాని ప్రాంతాలపై ప్రత్యేకంగా పగను పెంచుకోరు. కాకపోతే తాము పుట్టిపెరిగిన ప్రాంతాలపై మాత్రం ప్రత్యేక అభిమానం చూపిస్తుంటారు.*

అయితే అదేం దరిద్రమోగాని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాత్రం నెల్లూరు జిల్లా ప్రజలపై పగ, ప్రతీకారాలతో రగిలిపోతున్నాడు. దీనికి కారణమేంటనేది అందరికీ తెలిసిందే! 2014ఎన్నికల్లో ఇక్కడ తెలుగుదేశంకు కేవలం 3అసెంబ్లీ సీట్లే దక్కాయి. రెండు ఎంపీ స్థానాలు, 7అసెంబ్లీ స్థానాలు వైకాపా ఖాతాలో చేరాయి. దీనిని ఆయన మనసులో పెట్టుకున్నాడు. నెల్లూరుజిల్లా మీద కక్ష సాధింపు చర్యలకు దిగాడు. నెల్లూరుజిల్లాకు ఏ ఒక్క పని కూడా అడగొద్దని జిల్లా నాయకులకు ముందే చెప్పేసాడు. దానికి తగ్గట్లే కేంద్రం మంజూరు చేసిన ఏ జాతీయ సంస్థను కూడా ఆయన నెల్లూరు జిల్లాకు ఇవ్వలేదు. నెల్లూరుజిల్లాలో పెట్టుబడులు పెడతామని ముందుకొచ్చిన వారిని కూడా వెనక్కి తరిమేసారు.

అయితే ఆయన ఎంతగా జిల్లా అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నా యాధృచ్చికంగా కొన్నింటిని ఆపలేకపోతున్నాడు. ఈ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి వస్తున్న కంపెనీలన్నీ కూడా తడ సమీపంలోని శ్రీసిటీ వైపే చూస్తున్నాయి. ఇంకొన్ని కృష్ణపట్నం పోర్టు వైపు మొగ్గు చూపుతున్నాయి. శ్రీసిటీ సెజ్ భౌగోళికంగా చిత్తూరుజిల్లా సత్యవేదు నియోజకవర్గంలో వున్నా, ఈ సెజ్ వల్ల అభివృద్ధి చెందుతున్నది

(మిగతా 10వ పేజీలో)



## ఏడు ఖండాల కొండలపై...

# మువ్వన్నెల జెండా!

## అమర్ రహే... మస్తాన్

12లో




# కూలీల గుండెల్లో తూటా!

***తె**లంగాణ సిఎం కేసీఆర్ ఉద్యోగులుకు పీఆర్సీ ప్రకటిస్తే ఆంధ్ర సిఎం చంద్రబాబు కూడా ఇక్కడ ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటించాడు. కేసీఆర్ వాటర్ గ్రిడ్ అంటే చంద్రబాబు ఇక్కడ నీరు-చెట్టు అన్నాడు. కేసీఆర్ అక్కడ కరెంట్ ఛార్జీలు పెంచితే, చంద్రబాబు ఇక్కడ కరెంట్ ఛార్జీలు పెంచాడు. అలాగే 7వ తేదీ తెల్లారుజామున తెలంగాణ పోలీసులు ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు ఉగ్రవాదులను హతమారిస్తే, ఇది జరిగిన కొన్ని గంటలకే ఆంధ్రాలో పోలీసులు కూడా ఎన్‌కౌంటర్‌లో 20మందిని హతమార్చారు. అయితే అక్కడా ఇక్కడా జరిగింది ఎన్‌కౌంటర్‌లే! రెండు చోట్లా పేలింది తుపాకులే. కాల్చింది పోలీసులే! కాకపోతే ఒక్కటే తేడా!*

దేశ ద్రోహానికి పాల్పడుతూ ఎందరినో పొట్టను పెట్టుకున్న వికారుద్దీన్ అనే కరుడుగట్టిన ఉగ్రవాదితో పాటు మరో నలుగురిని తెలంగాణ పోలీసులు కాల్చి చంపారు. దీనిపట్ల ఎలాంటి వ్యతిరేకత లేదు. (మిగతా 10వ పేజీలో)





చిత్తూరుజిల్లా శేషాచలం అడవుల్లో 20మంది ఎర్రచందనం కూలీలను పోలీసులు ఎన్‌కౌంటర్‌లో హతమార్చిన నేపథ్యంలో నెల్లూరుజిల్లాలోనూ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎర్రచందనం అక్రమ రవాణా మీద ఉక్కు పాదం మోపే నేపథ్యంలోనే 20మంది కూలీలను ఎన్‌కౌంటర్‌లో హతమార్చినట్లుగా కనిపిస్తుంది. శేషాచలం ఎన్‌కౌంటర్ జిల్లాలోని స్మగ్లర్లకు ఒక హెచ్చరికగానే కాకుండా, ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టే విషయంలో జిల్లా పోలీసు యంత్రాంగానికి పూర్తి స్వేచ్ఛ నిచ్చినట్లయ్యింది.

చిత్తూరు, నెల్లూరు, కడప, కర్నూలు, ప్రకాశం... ఎర్రచందనం అక్రమ రవాణాతో అనుబంధం ఉండేది ఈ జిల్లాలకే! దేశంలోనే ఎర్రచందనం విరివిగా దొరికే శేషాచలం, వెలుగొండ, నల్లమల అడవులు ఈ జిల్లాల పరిధిలోనే వున్నాయి. ముఖ్యంగా చిత్తూరు జిల్లా తర్వాత ఎర్రచందనం అక్రమ రవాణా ఎక్కువగా జరుగుతున్నది నెల్లూరు జిల్లా నుండే!

వెంకటగిరి, రాపూరు, ఆత్మకూరు ప్రాంతాలను కేంద్రాలుగా చేసుకుని ఎర్రచందనం స్మగ్లర్లు తమ కార్యకలాపాలు కొనసాగిస్తూ వచ్చారు. చిత్తూరు జిల్లా స్మగ్లర్లు ఎక్కువగా తమిళనాడు కూలీలను రప్పించు కుని చెట్లను కొట్టించి అక్రమ రవాణా చేస్తుండేవాళ్లు. కాని నెల్లూరు జిల్లాలోని స్మగ్లర్లు మాత్రం స్థానికంగా దొరికే కూలీలనే వాడుకునేవాళ్లు. వీరికి దినసరి కూలీ పెద్ద మొత్తంలో ఉంటుండడంతో కూలీలు ఉత్సాహంగా వస్తుండేవాళ్లు.

# నెల్లూరుజిల్లాలోనూ 'రెడ్' అలర్ట్

## ○ ఎన్‌కౌంటర్ నేపథ్యంలో స్మగ్లర్లకు, ఎర్రచందనం కూలీలకు ముచ్చెమటలు

కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నంత వరకు జిల్లాలో ఎర్రచందనం అక్రమరవాణా మూడు చెట్లు ఆరు దుంగలు అన్నట్లుగా సాగింది. అటవీ, పోలీసు శాఖలలోని కొందరి సహకారంతోనే ఎర్రచందనం అక్రమ రవాణా యధేచ్ఛగా జరిగింది. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో అయితే జిల్లా నుండి తరలిపోయిన ఎర్రచందనంలో పట్టుకున్నది కొంతే, తరలిపోయింది మాత్రం కొండంత.

తెలుగుదేశం వచ్చాక ఎర్రచందనం అక్రమ రవాణాకు కళ్లెం వేసింది. ఎర్రచందనను అమ్ముకుంటే గాని ఋణమాఫీ చేయలేని పరిస్థితుల్లో ప్రభుత్వమే ఈ ఎర్రచందనం నిర్వహణను చూసుకో సాగింది. అయినా కూడా జిల్లాలో అడపా దడపా ఎర్రచందనం అక్రమరవాణా సంఘటనలు బయటపడుతూనే ఉన్నాయి. గతంలో ఎస్పీగా పని చేసిన సెంథిల్ కుమార్ ఎర్రచందనం అక్రమ రవాణాను బాగానే కట్టడి చేసారు. జిల్లాలో పెద్ద స్మగ్లర్లపై కేసులు కూడా నమోదు చేశారు.

శేషాచలం ఎన్‌కౌంటర్ నేపథ్యంలో జిల్లాలోని స్మగ్లర్లకు, ఎర్రచందనం కూలీ లకు ముచ్చెమటలు పడుతున్నాయి. ఎర్ర చందనం జోలికి పోతే శేషాచలంలో పట్టిన గతే ఇక్కడా పడుతుందని ఎస్పీ గజరావు భూపాల్ ఘాటుగా హెచ్చరిం చారు. ఈమధ్యనే ఎర్రచందనం అక్రమ రవాణాకు చాలా మంది స్మగ్లర్లు టాటా చెప్పారు. ఈ ఎన్‌కౌంటర్ దెబ్బతో మిగతా స్మగ్లర్లు కూడా ఇంట్లో కూర్చోవాల్సిందే! కూలీలు ఈ దెబ్బకు భయపడి ఎర్ర చందనం చెట్ల జోలికి పోకపోవచ్చు.

## అడ్డంగా అణచివేస్తాం!

**- ఎస్పీ**



ఎర్రచందనం అక్రమరవాణాను పూర్తిస్థాయిలో అడ్డుకుంటామని, ఎర్రచందనం అక్రమరవాణాకు తెగబడే స్మగ్లర్లకు శేషాచలం అడవుల్లో పట్టిన గతే పడుతుందని జిల్లా ఎస్పీ గజరావు భూపాల్ హెచ్చరించారు. ఈ నెల 7వ తేదీన ఆయన ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్మగ్లర్లను ఉక్కుపాదంతో అణచివేస్తాం. అటవీ సంపద నశిస్తే అది దేశానికి, మానవజాతికే ప్రమాదకరం. కాని స్మగ్లర్లకు ఇది పట్టడం లేదు. కాబట్టి వారిపై కఠినచర్యలకు వెనుకాడబోమని ఎస్పీ హెచ్చరించారు. జిల్లాలో పోలీసు, అటవీశాఖల సమన్వయంతో నిఘాను ముమ్మరం చేసి స్మగ్లింగ్‌ను అరికడతామన్నారు. ఆత్మకూరు మండలంలోని కరటంపాడు – బసవరాజుపాలెం దారిలో పొలాల్లో అక్రమరవాణాకు సిద్ధం చేసిన 49ఎర్రచందనం దుంగలను సోమవారం రాత్రి స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ సుమారు 90లక్షల రూపాయలు ఉంటుందని ఆయన చెప్పారు. ఈ దుంగలను పట్టుకునేందుకు కృషి చేసిన ఆత్మకూరు సబ్‌డివిజన్ పోలీస్ సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సమావేశంలో డిఎస్పీ సుబ్బారెడ్డి, సిఐలు ఎం.కె.అల్తాఫ్‌హుస్సేన్, శ్రీనివాసరావు, ఎస్ఐ వేణుగోపాలరెడ్డి పాల్గొన్నారు.

## సాగునీరందక రైతుల ఇక్కట్లు

**- ఎమ్మెల్యే కాకాణి ఆవేదన**

సర్వేపల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో రైతులు సాగు నీరు అందక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అనేక చోట్ల వేసుకున్న పంటలకు నీటి వసతులు లేక ఎండిపోతు న్నాయని ఆయన అన్నారు. సోమవారం ఆయన పొదలకూరు మండలంలోని నేదురుమల్లి గ్రామంలో సర్వశిక్షా అభి యాన్ కింద రూ.19.59 లక్షలతో నిర్మిం చిన పాఠశాల భవనాలకు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కండలేరు ఎడమగట్టు కాలువకు లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తయితే అనేక గ్రామాలకు సాగునీరు అందే అవకాశం వుందని అన్నారు. ఈ నేపథ్యంలో అసం పూర్తిగా వున్న సోమశిల కాలువల నిర్మా ణాలను వెంటనే పూర్తిచేయించేందుకు తగు కృషి చేస్తానని, ఆ మేరకు ప్రభుత్వంపై వత్తిడి తీసుకువస్తామని ఎమ్మెల్యే కాకాణి అన్నారు. గ్రామాల్లో సమస్యలను పరిష్కరిం చేందుకు ఎమ్మెల్యేలకు నిధులు విడుదల చేసే అవకాశం లేకుండాపోయిందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎమ్మెల్యేలకు నిధులను కేటాయించకుండా ఉత్సవ విగ్రహాలుగా మార్చుతున్నాడని ఆయన ఈ సందర్భంగా విమర్శించారు. నేదురుమల్లి, వెలికంటిపాలెం గ్రామాల ప్రజలకు అవసరమైన నీటి శుద్ధి పథకాన్ని అమలు చేసేందుకు ఎంపి నిధులను మంజూరు చేయిస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో ఎంపిపి కోనం బ్రహ్మయ్య, నేదురుమల్లి ఎంపిటిసి సభ్యుడు తిక్కవనేని పెంచలనాయుడు, సర్పంచ్ డి.రమణయ్య, వైఎస్సార్సీపి జిల్లా కార్యదర్శి గోగిరెడ్డి గోపాలరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, నాయకులు పి.వేణు, పులి సుబ్బారెడ్డి, నోటి మాల కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎండు ముఖంతో 'స్వర్ణముఖి'

**- రైతన్నల విలవిల**



వాకాడు వద్ద వున్న స్వర్ణముఖి ఎండు ముఖంతో వెలవెలబోతోంది. తీవ్రమైన వర్షాభావంతో, నీటి చుక్క లేక రిజర్వాయ రంతా ఎండిపోయి నెర్రెలు బారుతోంది. ఎగువ ప్రాంతాల్లో కూడా వర్షాలు లేక పోవడంతో ఈ రిజర్వాయర్‌కు నీరు లేక ఎండిపోయింది. స్వర్ణముఖి బ్యారేజ్ రిజర్వాయర్ కింద సుమారు 10వేల ఎక రాల దాకా పంటపొలాలున్నాయి. అయితే, బ్యారేజ్‌లో నీరు లేకపోవడంతో ఇప్పుడు చివరి దశలో వున్న పంటలన్నీ ఎండిపోతు న్నాయంటూ రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి బ్యారేజ్ నిర్మించినా, వర్షాలు కురవక పోవడంతో ఇది నిరుపయోగంగానే వుం టోందని వారు వాపోతున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ఈ దుస్థితిని గమనించి, స్వర్ణముఖి నీటి కళతో వుండేవిధంగా, తెలుగుగంగ నీటిని బ్యారేజ్‌కి కొంత మేరకైనా వదిలితే ప్రయోజనకరంగా వుంటుందని రైతులు కోరుకుంటున్నారు.

## రామాయపట్నంలో పోర్టు నిర్మించాలి

నెల్లూరుజిల్లా కావలికి సమీపంలోని ప్రకాశంజిల్లా రామాయపట్నంకు పోర్టును మంజూరు చేయాలని కేంద్ర నౌకాయానశాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరుతూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు, ప్రకాశం జిల్లా ఇన్‌ఛార్జి కందుకూరి వెంకట సత్యనారాయణ వినతిపత్రం అందజేశారు. ఆదివారం కావలి సమీపంలోని రామదూత ఆశ్రమానికి వచ్చిన కేంద్రమంత్రి గడ్కరిని కందుకూరి కలిసి విజ్ఞప్తి చేసారు. అక్కడ పోర్టును నిర్మిస్తే నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో దాదాపు 40మండలాలు అభివృద్ధి చెందుతాయన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, అసెంబ్లీ ఇన్‌ఛార్జి సత్యం, రాష్ట్ర నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.

## సాహసవంతుడు మస్తాన్‌బాబు

భారతదేశం గర్వించదగ్గ సాహసవంతుడు మస్తాన్‌బాబు అని బీజేపీ నాయకుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం నేదురుమల్లి నివాసంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మస్తాన్‌బాబు మరణం తీరని లోటని, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. యువతకు మస్తాన్‌బాబు ఆదర్శంగా నిలిచాడన్నారు. మస్తాన్‌బాబు భౌతిక కాయాన్ని జిల్లాకు రప్పించేందుకు వెంకయ్యనాయుడు విదేశాంగశాఖ మంత్రి సుష్మాస్వరాజ్‌తో ప్రయత్నిస్తున్నాడని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు ఎల్.కోటేశ్వరరావు, డిసిఎంఎస్ ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాసులురెడ్డి, నెలబల్లి రమణారెడ్డి, పి.రామారావు, శ్రీహరికోట కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రచందనం దొంగల ముఠా అరెస్ట్

రాపూరు మండలం వెలుగొండ అడవుల్లో ఎర్రచందనం నరికేందుకు వెళుతున్న నలుగురు దొంగల ముఠాను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. వెంకటగిరి ఇన్‌ఛార్జి సిఐ భూషణం విలేకర్లతో మాట్లాడుతూ రాపూరు–చిట్వేలి మార్గమధ్యలో చింతమానుపెంట అటవీ ప్రాంతంలో ఎర్రచందనం చెట్లను నరికేందుకు వెళుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న పంగిలికి చెందిన కరిపం వెంకటాద్రి, దేవళ్ల వెంకటేశ్వర్లు, కరిపం పెంచలయ్య, రాపూరుకు చెందిన శ్రీనివాసులును అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరివద్ద నుంచి నాలుగు గొడ్డళ్లు, ఒక స్టింగ్ త్రాసు, రెండు బస్తాలు నూకలు, వంటపాత్రలు, సరుకులు, 15వాటర్ క్యాన్లు, పూజాసామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. ఎస్ఐ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

## మా హక్కులకు భంగం కలిగించవద్దు

**- అధికారులకు సర్పంచ్‌ల అభ్యర్థన**

జిల్లాలో 13వ ఆర్థిక సంఘం నిధుల విషయంలో అధికారులు తీసుకున్న నిర్ణయం తమకు కల్పించిన ప్రాథమిక హక్కులకు భంగం కలిగించేదిగా వుందని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు సర్పంచ్‌లు ఆ మేరకు సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రామ పంచాయతీలకు సంబంధించి 13వ ఆర్థిక సంఘం నిధులను డ్రా చేయడానికి ఎంపిడిఓలను సర్పంచ్‌లతో పాటు రెండవ సంతకం చేయాల్సివుంటుందని జిల్లా యంత్రాంగం పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారని, ఈ నిర్ణయం సర్పంచ్‌ల హక్కులకు భంగం కలిగించేదిగా వుందని వారు ఆవేదనతో తెలిపారు. మంచినీరు, పారిశుద్ధ్యం, విద్యుత్‌బిల్లులు చెల్లింపులకు మాత్రమే ఆ నిధులను వినియోగిస్తారని, నిధులు పక్కదారి పట్టే అవకాశం లేదని వారు వివరించారు. చేసిన పనులకు సంబంధించి ఇంజనీరింగ్ శాఖ అధికారులు పరిశీలించి ఎంబుక్‌లో నమోదు చేసిన తర్వాతనే నిధులు విడుదల చేస్తారని వారు వెల్లడించారు. ఈ ప్రక్రియలో అక్రమాలు జరిగే అవకాశం లేదని, ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన నిధులు మంచినీటి అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని జిల్లా యంత్రాంగం ఉత్తర్వులు జారీచేస్తే ఆడిట్ అభ్యంతరం లేకుండా వుంటుందని వారు వివరించారు. ఈ విషయాలకు సంబంధించి రెండో సంతకం అవసరం లేదని సూచించారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా రెండవ సంతకం విధానం జిల్లాలో అమలు చేయడం సర్పంచ్‌ల హక్కులకు భంగం వాటిల్లేలా వుందని వారు ఆందోళనతో తెలిపారు. అలాంటి ఉత్తర్వులను రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు మండల సర్పంచ్‌ల యూనియన్ నాయకులు నాగేశ్వరరావు, శివకుమార్, మల్లికార్జున్‌రెడ్డి, వెంకటేశ్వరరాజు, అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



• టౌన్‌హాలు

# వెలవెలబోయిన వందేళ్ల వేడుక

*బండిమీద వేయించిన వేరుశనగ పప్పులు ఓ ప్రక్క, వుడకబెట్టిన వేరుశనగకాయలు, రేగిపళ్లు, ముక్కలుగా కత్తిరించి పుష్పాకారం వేసిన బెంగుళూరు మామిడికాయలు మరోప్రక్క... ఇవన్నీ రోడ్డుపై అమ్ముతుంటే, రాత్రంతా జరగబోయే చింతామణి నాటకంలో సుబ్బిశెట్టి చలోక్తులు వినడానికో, సత్యహరిశ్చంద్రలోని కాటి సీను పద్యాలను ఆస్వాదించడానికో, లేక నెఫ్జా సుందరరామిరెడ్డి నిర్వహించే కళా పోటీలు తిలకించడానికో గేట్ల వద్ద బారులుతీరిన కళాభిమానులు మరోవైపు... ఇవన్నీ నెల్లూరు 'టౌన్‌హాలు'ను తలుచుకుంటే గుర్తొచ్చే మధురజ్ఞాపకాలు.*

సంగీత, సాహిత్య, సాంస్కృతిక కళా వైభవాలతో పాటు స్కూల్ వార్షికోత్సవాలు, సంస్థల పుట్టినరోజులు, సంస్మరణసభలు, రాజకీయ ఉపన్యాసాలతో పాటు కల్యాణాలకు సైతం ఈ వేదిక ప్రసిద్ధి చెందింది. రావుబహుదూర్ రేబాల లక్ష్మీనరసారెడ్డి నెల్లూరీయులకు ఓ అపూర్వ కానుకగా ఈ పురమందిరాన్ని అందించారు.

ఇప్పుడా పురమందిరానికి వందేళ్లు పూర్తయ్యాయి. 1915లో నిర్మించిన ఈ సంబరాల సముదాయానికి 2015కి నూరు సంవత్సరాలు నిండాయి. ఇది అతి అరుదైన సందర్భం. కొన్ని వేల వేడుకలకు వేదికైన ఈ సుందర ప్రాంగణానికి వందేళ్లు నిండిన సందర్భాన్ని చూసే అదృష్టం ఈ తరం వారికి దక్కడం ఆనందదాయకం.

అతి పురాతన కట్టడంగా పేరుగాంచిన టౌన్‌హాలుకి కొత్త సొబగులుదిద్ది దశాబ్దకాలం క్రితం జె.యస్.రెడ్డి నెల్లూరీయులకు పునరంకితం చేశారు. మళ్లీ ఇప్పుడు వందేళ్ల సందర్భంగా టౌన్‌హాల్ ట్రస్టు బోర్డు కమిటీ వారు హాలు అందాలకు మెరుగులు దిద్ది ఏసిలు అమర్చి టౌన్‌హాలు ఏ/సిగా మార్చారు.

వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా "శతాబ్ది వేడుకల" పేర 4రోజుల పాటు వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. రేబాల లక్ష్మీనరసారెడ్డి పురమందిరము, నెల్లూరు "శతాబ్దివేడుకలు" కార్యక్రమాలు అంటూ చివరిలో అందరూ ఆహ్వానితులే అని ఓ కరపత్రాన్ని ముద్రించారు. ఈ కరపత్రం కేవలం సమాచార సూచికగా కనిపించిందే తప్ప ఎక్కడా "ఆహ్వానం" అని కాని అసలు ఎవరు ఆహ్వానిస్తున్నారని కానీ లేదు. అసలు ఇది ఆహ్వానపత్రిక అని చూసినవారు ఎవరూ అనుకోరు. నూరేళ్ల చరిత్ర కలిగిన టౌన్‌హాలు శత వసంత వేడుకలకు ముద్రించిన కరపత్రం తీరు ఇంత దీనంగా, దయనీయంగా వుండడం నిజంగా దారుణం. కార్యక్రమంలో టౌన్‌హాలు ట్రస్టు కమిటీ చేస్తోందా? లేక ఎవరైనా దాతలు చేస్తున్నారా? చేస్తుంటే వాళ్ల పేర్లేమిటి? అలా కానిపక్షంలో ట్రస్ట్ బోర్డు కమిటీయే ఈ సంబరాలు చేస్తుంటే ట్రస్టుబోర్డులో వున్న వారికి కూడా జీవిత సాఫల్య పురస్కారాలు ఇచ్చుకోవడం ఏమిటన్నది సమాధానం దొరకని ప్రశ్న. టౌన్‌హాలుకు శతాబ్ది ఉత్సవాలు జరుగుతున్న కళ కాంతి ఎక్కడా లేదు. టౌన్‌హాలులో ఒక్కరోజు వేడుక చేసుకునేవారు కూడా ఈ మందిరాన్ని ఎంతో అందంగా అలంకరిస్తారు. కనీసం ఆపాటి అలంకరణ కూడా ఈ వందేళ్ల పండుగకు చేయలేదు.

టౌన్‌హాలును సొంత నిధులతో మరమ్మత్తులు చేయించిన తర్వాత దాత జె.యస్.రెడ్డి దీని పునప్రారంభాన్ని అత్యంత ఘనంగా నిర్వహింపజేశారు. అయితే ఆయనే ఈ శతాబ్దివేడుకలలో ముందు భాగాన వున్నప్పటికీ ఎవరి సలహాలు విని ఈ వేడుకలను నిర్వహించారో గాని... ఈసారి వేడుకలు ఆయన స్థాయిలో జరగలేదన్నది మాత్రం చర్చనీయాంశమయ్యింది. నెల్లూరు టౌన్‌హాల్ వందేళ్ల పండుగ అంటే... నెల్లూరులోని ప్రతిఒక్కరి పండుగ. నెల్లూరులోని ప్రతి ఒక్కరికీ ఈ పురమందిరంతో అనుబంధం వుంటుంది. ఈ సంబరాల్లో పాల్గొనాలనే ఆశ ప్రతిఒక్కరికీ ఉంటుంది. కాని, ఈ శతాబ్ది వేడుకలను నిర్వహించిన వ్యక్తులు కేవలం ఈ వేడుకలను తమ సొంతింటి కార్యక్రమంలా నిర్వహించడం విచారకరం. నెల్లూరు నగరంలో ఎందరో కవులు, సాహితీవేత్తలు, కళాకారులు, సంగీత ప్రియులు, నాటక కోవిదులు, మేధావులు, కళా సంస్థలు... ఇలా ఎన్నో ఉన్నప్పటికీ వారెవరికీ ఈ ఉత్సవాల గురించి తెలియకపోవడం, కనీసం వారిని ఈ వేడుకలకు ఆహ్వానించాలనే ఆలోచనే ఈ వేడుకల నిర్వాహకులకు రాకపోవడం శోచనీయం. కనీసం ఈ వేడుకల్లో గానగంధర్వుడు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం, సినీ రచయిత వెన్నెలకంటి లాంటి వాళ్లు పాల్గొనబట్టి కొంత హుందాతనమన్నా వచ్చింది కాని, లేకుంటే ఈ కార్యక్రమాలు ఇంకా వెలవెలబోయి ఉండేవి. విచిత్రమేమంటే ఈ వందేళ్ల పండుగ ప్రారంభ సమయంలోనే గట్టిగా వందమంది కూడా లేకపోవడం వేడుకల నిర్వహణ అసమర్థతను ఎత్తిచూపింది. వందేళ్ల వేడుకలనేవి మళ్లీ మళ్లీ చేయలేము. ఇంకో వందేళ్లకు గాని ఇలాంటి అవకాశం రాదు. అప్పటికి ఈ తరం ఉండదు. కాబట్టి వచ్చిన ఓ సువర్ణ అవకాశాన్ని మనం చేజేతులారా జారవిడుచుకున్నట్లే!

ఏదే మైనా, ఎంతో చరిత్రాత్మకమైన టౌన్‌హాలు శతాబ్ది ఉత్సవాలను ఇంత వెలితిగా, వెలవెలబోయేలా చేయడం ఎంతైనా విచారకరం.

***చివరిగా ఓ మాట...***

తనకు, తన తండ్రికీ టౌన్‌హాల్‌తో వున్న మధురానుబంధాన్ని గుర్తు చేసుకుంటూ తన బిజీ షెడ్యూల్‌ను సైతం ప్రక్కనపెట్టి 7వ తేదీ ఉదయమే బెంగుళూరులో రికార్డింగ్ వున్నప్పటికీ 6వ తేదీ రాత్రి 10.30గంటల వరకూ యస్.పి. బాలసుబ్రహ్మణ్యం ఈ వేడుకలలో పాల్గొనడం టౌన్‌హాలు పట్ల ఆయనకున్న మమకారాన్ని స్పష్టం చేస్తోంది.

తన తండ్రి విగ్రహాన్ని టౌన్‌హాల్లో ప్రతిష్ఠించుకోవాలని పదేపదే కోరుకున్న బాలసుబ్రహ్మణ్యం గారి అభీష్టాన్ని కనీసం ఈ సందర్భంలోనైనా కమిటీ వారు ఆమోదించడం సముచితంగా వుంటుందేమో కమిటీ వారు ఆలోచించాలి.



అంజనీపుత్రుడికి వెండి తొడుగు

# ఆధ్యాత్మిక సేవలో వేమిరెడ్డి

నెల్లూరు, దర్గామిట్టలోని శబరి శ్రీరామక్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ నెల 8వ తేదీన జరిగిన ఉత్సవాలకు ప్రముఖ పారిశ్రామికవేత్త, దాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాలతో వెళ్లి ఆలయంలోని శ్రీ ఆంజనేయస్వామికి వెండి తొడుగును బహుకరించారు. ఈ సందర్భంగా జరిగిన పుష్పయాగంలో ప్రభాకర్‌రెడ్డి దంపతులు పాల్గొని హనుమత్సమేత సీతాలక్ష్మణ సహిత కోదండ రామస్వామికి 12రకాల పుష్పాలతో అంగరంగ వైభవంగా పూజలు నిర్వహించారు.

**గోపూజలో...** నెల్లూరు మూలాపేట వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి పొన్నవాహనసేవ వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమాల్లో గోశాలలోని గోవులకు వేదపండితుల ఆధ్వర్యంలో విశేషపూజలు నిర్వహించారు. గోప్రదక్షిణ గావించి కర్పూరహారతులిచ్చి విశేషపూజలు చేశారు. ఆలయ పూజారులు శాస్త్రోక్తంగా వేదమంత్రోచ్ఛారణలతో వేమిరెడ్డిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆనం రంగమయూర్‌రెడ్డి, ఆలయ మేనేజర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గోపూజలో...

# 18న 'కూచిపూడి నాట్య కళావైభవం'

## సింహపురీయులందరికీ ప్రపంచ తెలుగు సమాఖ్య ఆహ్వానం

ప్రపంచ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన 'కూచిపూడి నాట్య కళావైభవం'ను అత్యంత వేడుకగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కూచిపూడి నాట్యకళా వైభవాన్ని నెల్లూరులో తొలిసారిగా ప్రదర్శించనుండడంతో ఈ కార్యక్రమాన్ని తిలకించాలనే ఆసక్తి అందరిలోనూ కలుగుతోంది. ప్రఖ్యాత కూచిపూడి నాట్యాచార్యులతో ప్రదర్శితమయ్యే నృత్యాలు, భామాకలాపం వగైరాలతో పాటు మరెంతో ప్రసిద్ధి చెందిన పేరిణి శివతాండవాన్ని కూడా ఈ కార్యక్రమాల్లో ప్రదర్శించేందుకు సమాయత్తం కావడం విశేషం. భారతీయ సంప్రదాయ నృత్యరీతుల్లో విశిష్టమైన కూచిపూడి నృత్య ప్రదర్శనలతో పాటు, 'ఆంధ్ర నాట్యం' వైశిష్ట్యాన్ని గురించి కూడా ఈ కార్యక్రమంలో వివరించనున్నారు. అరుదైన ఇన్ని కార్యక్రమాలను నెల్లూరు కళాభిమానులు, నృత్యకళాభిమానులందరికీ అందించేందుకు వీలుగా నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రముఖ వదాన్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. నెల్లూరు గొలగమూడి రోడ్‌లో వున్న విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ అందుకు వేదిక కానుంది. ఈ నెల 18వ తేదీ ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు విఖ్యాత నృత్యకళాకారులెందరో విచ్చేస్తున్నారు. ఆరోజు ఉదయం 9.30గంటలకు కూచిపూడి సంప్రదాయానుసారంగా 'పూర్వరంగం' ఆరంభమవుతుంది. జ్యోతి ప్రజ్వలన అనంతరం 9.45 గంటలకు జరిగే సభా కార్యక్రమంలో తొలుత ప్రపంచ తెలుగు సమాఖ్య అధ్యక్షులు శ్రీమతి వి.ఎల్ ఇందిరాదత్ స్వాగతోపన్యాసం చేస్తారు. ప్రపంచ తెలుగు సమాఖ్య భాషా సాహిత్యం విభాగం ఛైర్మెన్ శ్రీమతి డి. మంజులత సభా కార్యక్రమాన్ని వివరిస్తారు. ఈ సభలో గౌరవ అతిథిగా జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి పాల్గొంటారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర విద్యాశాఖా మాత్యులు గంటా శ్రీనివాసరావు పాల్గొని ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమానికి ప్రపంచ తెలుగు సమాఖ్య సాంస్కృతిక కార్యక్రమాల కమిటీ ఛైర్మెన్ పివి సాయి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తారు. ప్రపంచ తెలుగు సమాఖ్య ఉపాధ్యక్షులు, ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి వందన సమర్పణ చేస్తారు. అనంతరం, 11.15 గంటలకు నృత్య కార్యక్రమాలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. తొలుత, 'కలాపములు' ప్రదర్శనా పూర్వక ప్రసంగం వుంటుంది. ప్రఖ్యాత నాట్యాచార్యులు శ్రీ పసుమర్తి కేశవ ప్రసాద్ ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. 11.30 గంటలకు విజయవాడకు చెందిన సిహెచ్ అజయ్‌కుమార్ బృందం వారిచే 'భామా కలాపం' నృత్య ప్రదర్శన వుంటుంది. మధ్యాహ్నం 12 గంటలకు ప్రఖ్యాత కూచిపూడి నాట్యాచార్యులు డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి (కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, సిద్ధేంద్రయోగి కూచిపూడి కళాపీఠం) 'నృత్యనాటకాలు' అనే అంశంపై ప్రసంగిస్తారు. 12.20 గంటలకు హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ నాట్యాచార్యులు శ్రీ కళాకృష్ణ గారిచే పేరిణీ (తాండవం-లాస్యం) నృత్యంపై ప్రదర్శనాపూర్వక ప్రసంగం వుంటుంది. 12.40 గంటలకు అత్యద్భుతమైన 'పేరిణీ శివ తాండవం' నృత్యప్రదర్శన వుంటుంది. ఆ తర్వాత, 1 గంటకు చెన్నైకి చెందిన కళైమామణి ఉమామురళీ 'సింహనందిని' నృత్యప్రదర్శన వుంటుంది. మధ్యాహ్నం 1.30 గంటలకు భోజన విరామం అనంతరం, మధ్యాహ్నం 3 నుంచి ప్రముఖ నాట్య గురువులు శ్రీ కళాకృష్ణ (కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత-హైదరాబాద్) గారు 'ఆంధ్రనాట్యం' అనే అంశంపై ప్రసంగిస్తారు. 3.10గంటలకు శ్రీ కళాకృష్ణ బృందంచే 'సాంప్రదాయ నాట్యాలు' (ఆంధ్ర నాట్యం) నృత్య ప్రదర్శన, 3.30 గంటలకు హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ నాట్య గురువులు శ్రీ భాగవతుల సేతురామ్, డాక్టర్ వనజా ఉదయ్‌లచే 'ఏకపాత్ర కేళికలు' అనే అంశంపై ప్రదర్శనా పూర్వక ప్రసంగం వుంటుంది. 3.45 ఏకపాత్ర కేళికల-నృత్యప్రదర్శనల్లో భాగంగా, నెల్లూరుకు చెందిన ప్రముఖ నాట్యకళాకారిణి నదియా, బెంగళూరుకు చెందిన శ్రీమతి సునంద ప్రశాంత్, హైదరాబాద్‌కు చెందిన కుమారి సిందూర మూర్తిల నృత్యప్రదర్శనలుంటాయి. ఆ తర్వాత, 4.45 గంటలకు ప్రముఖ నాట్యాచార్యులు శ్రీ రాధేశ్యామ్ 'యక్షగానాలు' అనే అంశంపై ప్రసంగిస్తారు. సాయంత్రం 5 గంటలకు శ్రీ వేదాంతం రాధేశ్యామ్, మరియు వారి బృందం 'భక్తప్రహ్లాద' యక్షగానాన్ని ప్రదర్శిస్తారు. 6.30 గంటలకు ప్రముఖ నాట్యగురువులు శ్రీ భాగవతుల సేతురామ్, డాక్టర్ వనజా ఉదయ్, వారి బృందం (హైదరాబాద్) 'గిరిజా కల్యాణం' నృత్యనాటికను ప్రదర్శిస్తారు. అద్యంతం కూచిపూడి నాట్యకళా సౌరభాలు వెదజల్లే ఈ కార్యక్రమాలకు కళాకారులు, నాట్యకళాభిమానులు, ప్రజలు అందరూ విచ్చేసి ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ కమిటీ ఛైర్మెన్ ఎన్.బలరామయ్యనాయుడు కోరుతున్నారు.

## 'ప్రభా'తం

పేరు మార్చుకోవడం, వేషాలు మార్చుకోవడం, చివరికి తనను గుర్తుపట్టకుండా వుండేందుకు ముఖానికి ప్లాస్టిక్ సర్జరీ సైతం చేయించుకోవడం, తన ఆచూకీ తెలియకుండా వుండడానికి తరచూ ఇళ్ళు మారుతూవుండడం.. ఒకటేమిటి రకరకాల వేషాలు వేస్తూ, ఉగ్రవాద కార్యక్రమాలను చురుగ్గా సాగించే నేరచరిత్ర వున్న కరుడుగట్టిన ఐఎస్ఐ ఉగ్రవాది వికారుద్దీన్ చరిత్రకు పోలీసులు ముగింపు పలికారు. పోలీసులను మట్టుబెడతానని సవాల్ విసిరే వికార్, చివరికి పోలీసుల చేతిలోనే హతమైపోయాడు. అతనితో పాటు, మరో నలుగురు ఉగ్రవాదుల్ని కూడా పోలీసులు మట్టుబెట్టారు. హైదరాబాద్‌లో 2007 నుంచి 2009 దాకా వికారుద్దీన్, అతని ముఠాసభ్యులు పలు హింసాత్మక సంఘటనలకు పాల్పడి పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా చేశాడు. ఉగ్రవాదంతో భీభత్సాలు సృష్టించే వికారుద్దీన్ ముఠా జైలు నుంచి కోర్టు విచారణకు వెళ్ళున్న సమయంలో కూడా తమ ఉగ్రబుద్ధిని వీడలేదు. పోలీసుల నుంచి ఆయుధాలు లాక్కొని పారిపోయే యత్నం చేయడమే కాక, పోలీసులపై కూడా ఆయుధాలు గురిపెట్టడంతో పోలీసులు ఉగ్రులై... ఆ ముఠాను అక్కడికక్కడే మట్టుబెట్టారు. సంచలనాత్మకమైన ఈ సంఘటనతో తెలంగాణ ప్రాంతం ఉలిక్కిపడింది. పేరుమోసిన నేరగాడు, విద్యార్థి దశలోనే ఉగ్రవాద విషబీజాలను మనసులో నాటుకుని తనకంటూ సొంతసైన్యాన్ని సైతం ఏర్పాటు చేసుకుని పోలీసులపై తరచూ దాడులకు తెగబడుతూ భీభత్సం సృష్టించే చరిత్ర వున్న వికారుద్దీన్ నేరచరిత్రకు పోలీసులు ముగింపు పలకడం సర్వత్రా కలకలం సృష్టించింది. దేశానికే సవాల్ విసురుతున్న సిమి సంస్థకు చెందిన ఉగ్రవాదుల్లో ముఖ్యుడైన వికారుద్దీన్ మంగళవారం తెలంగాణా లోని నల్గొండ జిల్లా ఆలేరు సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందాడని, ఈ కరుడుగట్టిన నేరస్తునితో పాటు, అతని ముఠాగా వున్న మరో నలుగురు ఉగ్రవాదులు కూడా పోలీసుల కాల్పుల్లో మృతిచెందారన్న సమాచారం తెలంగాణాలోనే కాక దేశవ్యాప్తంగా సంచలనం కలిగించింది. వరంగల్ జైలు నుంచి హైదరాబాద్‌లోని కోర్టుకు విచారణ కోసం ఈ ఉగ్రవాదుల ముఠాను పోలీసులు వ్యాన్‌లో తీసుకువెళ్తుండగా, మార్గమధ్యంలో మూత్రవిసర్జన కోసం వ్యాన్‌ను ఆపాలని వికారుద్దీన్ కోరాడని, తిరిగి వాహనం ఎక్కుతున్న సమయంలో వికారుద్దీన్ ఒక్కసారిగా ఎస్కార్ట్ చేతిలో వున్న ఆయు ధాన్ని లాక్కుని కాల్పులు జరిపాడని, ఆదే అదనుగా మిగిలిన నలుగురు ఉగ్రవాదులు కూడా పోలీసుల నుంచి ఆయుధాలను లాక్కునే ప్రయత్నం చేయడంతో, పోలీసులంతా అప్రమత్తమై గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆత్మరక్షణ కోసం కాల్పులు జరపగా, ఈ కాల్పుల్లో ఆ అయిదుగురు ఉగ్రవాదులూ అక్కడికక్కడే మృతిచెందారని పోలీసులు పేర్కొంటున్నారు. ఈ ఘటనలో ఆర్‌ఎస్ఐ స్వల్పంగా గాయపడ్డాడని కూడా వారు చెప్తున్నారు. కాగా, ఇటీవల సూర్యాపేట బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులపై ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు మృతి చెందడం, మరో రెండురోజుల తర్వాత ఉగ్రవాదులతో జరిగిన ఎదురుకాల్పుల్లో మరో పోలీసు మృతి చెందడం, ఈ వరుస సంఘటనలపై పోలీసులు అప్రమత్తమై వున్న తరుణంలో మంగళవారం వికారుద్దీన్‌తో సహా అయిదుగురు ఉగ్రవాదులు ఎన్‌కౌంటర్‌లో మృతిచెందడంతో అన్ని రాష్ట్రాలు ఒక్కసారి ఉలిక్కిపడ్డాయి. వికార్ నేరచరిత కూడా బయటపడింది. హైదరాబాద్‌కు చెందిన వికార్ చిన్నతనం నుంచీ ఉగ్రవాద భావాలతో వుండేవాడు. విద్యార్థి దశలోనే ఇస్లామిక్ స్టూడెంట్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా(సిమి) అనే ఉగ్రవాద సంస్థతో అనుబంధం పెంచుకున్నాడు. సిమి కార్యకలాపాల్లో పాల్గొంటూ నరనరానా విద్వేషాన్ని నింపుకుని, లష్కరే తొయిబా వంటి ఉగ్రవాద సంస్థలతో కూడా పరిచయాలు పెంచుకున్నాడు. పేలుడు పదార్థాల తయారీలో నైపుణ్యం సాధించిన ఈ ఉగ్రవాది, విధ్వంసాలను సృష్టించేందుకు తరచూ వ్యూహాలు పన్నేవాడు. బాంబుపేలుళ్ళు, దాడులు జరిపి పోలీసులకు చిక్క కుండా తప్పించుకోవడానికి అమలుచేయాల్సిన వ్యూహాలను రూపొందించడంలో వికార్ దిట్ట అని తెలుస్తోంది. పోలీసులపై ద్వేషభావంతో రగిలిపోయేవాడు. పోలీసులకు చిక్కినట్టే చిక్కి, పోలీసులపై కాల్పులు జరిపి తప్పించుకున్న ఘటనలు కూడా వున్నాయి. పోలీస్‌పికెట్‌పై ఒకసారి కాల్పులు జరిపి ఓ హోంగార్డును హతమార్చిన నేరచరిత్ర కూడా వుంది. ఎంతోకాలంగా అంతుపట్టకుండా తిరుగుతున్న ఈ ఉగ్రవాది దాదాపు మూడేళ్ళ పాటు హైదరాబాద్ పోలీసులను ముప్పుతిప్పలు పెట్టేవాడు. అయితే, క్రమంగా పోలీసులు వికార్ గుట్టుమట్టులన్నీ తెలుసుకున్నారు. ఎట్టకేలకు అయిదేళ్ళక్రితం వికార్‌తో పాటు, అతని ముఠా సభ్యులు కూడా పోలీసులకు దొరికిపోయారు. మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో వికార్‌తో పాటు, ఆ ఉగ్రవాద ముఠా సభ్యులు కూడా మృతిచెందడం సంచలనం కలిగించింది. వాస్తవానికి, ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోకూడదు. అది ఉగ్రవాదులైనా, పోలీసులైనా సరే..ఎదుటివారి ప్రాణాలను హరించే హక్కు ఎవరికీ లేదన్నది నిర్వివాదాంశం. అయితే, సమాజంలో క్రమేనా హింసాత్మక ప్రవృత్తి పెరిగిపోతుండడం, అరాచకత్వం విజృంభిస్తుండడం, భయానక ధోరణులు పెచ్చరిల్లిపోతుండడం ఎంతైనా బాధాకరం.

ఏదేమైనప్పటికీ, రానురాను ప్రపంచానికే ముప్పుగా పరిణమిస్తున్న ఉగ్రవాదం పట్ల అందరూ అప్రమత్తంగా వుండాలి. ఉగ్రవాదం ఏ రూపంలో వున్నా దానికి దూరంగా వుండాలి.. అది మన దరికి రాకుండా చూసుకోవాలి. ఉగ్రవాదానికి ఎవరూ ఎలాంటి ఆశ్రయమూ ఇవ్వకుండా, ఎలాంటి తోడ్పాటునివ్వకుండా దానిని దూరం చేయాలి. మన శాంతినీ, మన సమాజాన్నీ మనమే పరిరక్షించుకోవాలి. అలా ఉగ్రవాదాన్ని పూర్తిగా దూరం చేయగలిగినప్పుడే హింసాత్మక ఘటనల నుంచి సమాజం బయటపడేందుకు మార్గం ఏర్పడుతుంది. ఉగ్రవాదులకే కాదు, ఉగ్రవాదానికే దూరంగా వుంటూ.. దానికి తావు లేకుండా చేయగలిగినప్పుడే సమాజానికి హింసాత్మక ఘటనల నుంచి విముక్తి లభిస్తుంది!.. అప్పుడే, సమాజానికి నిజమైన శాంతి లభిస్తుంది.

### ఉగ్రవాదంపై ఉగ్రరూపం



కరుడుగట్టిన ఉగ్రవాది వికారుద్దీన్‌తో పాటు, అతని ముఠా సభ్యులైన మరో నలుగురు ఉగ్రవాదులు కూడా ఇటీవల పోలీసుల కాల్పుల్లో మృతిచెందారు. గతంలో హైదరాబాద్‌ను గడగడలాడించిన ఈ ఉగ్రవాది, అతని ముఠాసభ్యులు కొంతకాలం క్రితం పట్టుబడ్డాడు. పోలీసులు కోర్టుకు విచారణకు తీసుకువెళ్తుండగా, మార్గమధ్యంలో పోలీసుల నుంచి ఆయుధాలు లాక్కునేందుకు ఈ ఉగ్రవాదులు యత్నించడంతో పోలీసులు జరిపిన కాల్పుల్లో వికారుద్దీన్‌తో పాటు, ఆ నలుగురు ఉగ్రవాదులు కూడా హతమైపోయారు. ఈ సంఘటన తెలంగాణాలోనే కాదు, దేశవ్యాప్తంగా సంచలనం కలిగించింది.

## మస్తాన్‌బాబు జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి

భారతదేశ కీర్తి ప్రతిష్టలను ప్రపంచానికి చాటిచెప్పిన నెల్లూరుజిల్లాకు చెందిన మల్లి మస్తాన్‌బాబు జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వైయస్సార్సీపి రూరల్ పార్టీ కార్యాలయంలో వైయస్సార్సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో మస్తాన్‌బాబుకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ మస్తాన్‌బాబు పర్వతారోహకుడుగా నెల్లూరుజిల్లా కీర్తిని ప్రపంచం నలుమూలలా చాటారన్నారు. జిల్లాలో ఆయన స్మారక విగ్రహాన్ని ప్రభుత్వమే అన్ని ఖర్చులతో నెలకొల్పాలన్నారు.

### పద్మశ్రీ అవార్డుకు అర్హులు

మల్లి మస్తాన్‌బాబు పద్మశ్రీ అవార్డుకు అర్హుడని పలువురు పేర్కొన్నారు. నెల్లూరుజిల్లా కావలి పట్టణం రెడ్‌క్రాస్ భవనంలో సోమవారం మస్తాన్‌బాబు సంతాప సభ దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీఓ ఎం.ఎల్.నరసింహం మస్తాన్‌బాబు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

### జాతిరత్నం

పర్వతారోహణలో ప్రాణాలు కోల్పోయిన మల్లి మస్తాన్‌బాబు ఈ జాతికి రత్నం వంటివారని కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. సోమవారం ఆయన సంగం మండలం గాంధీజన సంఘంలోని మస్తాన్‌బాబు తల్లి సుబ్బమ్మ, సోదరి దొరసానమ్మ, సోదరులు పెద్దమస్తానయ్య, చిన్న మస్తానయ్యలను పరామర్శించారు. మస్తాన్‌బాబు గాంధీజన సంఘం గ్రామానికి చెందినవారు కావడం గొప్ప విషయమన్నారు.

## భాజపా ఆవిర్భావ దినోత్సవం

భారతీయ జనతాపార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నెల్లూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగాయి. పార్టీ నగర అధ్యక్షులు మండ్ల ఈశ్వరయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డిలు మాట్లాడుతూ దేశ ప్రజలంతా సంఘటితమై బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని అధికారం అప్పగించారని తెలిపారు. ప్రజల ఆశలు వమ్ము కానీయకుండా నరేంద్ర మోడీ దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్నారన్నారు. గత 9నెలల భారతీయ జనతాపార్టీ పాలనలో చేపట్టిన కార్యక్రమాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కేవన్ చక్రధారి, కుడుముల సుధాకర్‌రెడ్డి, కోటేశ్వరమ్మ, విజయ్‌కుమార్, బందారు శ్రీనివాసులు, నరశింహులు నాయుడు, రాజేష్, మొగరాల సురేష్, నూతలపాటి పద్మజ, పరుశురాం, మధు, జనార్దన్, షాజహాన్, కరీం బాషా తదితరులు పాల్గొన్నారు.




### నిజాయితీకి బదిలీ బహుమానం

నెల్లూరుజిల్లా చిల్లర రాజకీయాలకు నిజాయితీ అధికారిగా పేరుబడ్డ ఎస్పీ సెంథిల్‌కుమార్ బదిలీ కావడం శోచనీయం. అధికారం చేతిలో ఉంది కదా అని అధికారపార్టీ ఎమ్మెల్యేలు నిజాయితీగల అధికారులను బదిలీ చేయించడం తగదు. ఎస్పీ సెంథిల్‌కుమార్ అక్రమాలు, అన్యాయాలకు కళ్లెం వేశారు. పనితీరులో గతంలో పనిచేసిన కొత్తకోట శ్రీనివాసరెడ్డిని గుర్తుకుతెచ్చారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ గతంలో కలెక్టర్ ముందే మైకు విరిచి గూండాలా ప్రవర్తించాడు. వారి దౌర్జన్యాలపై లాఠీ ఎత్తినందుకు 8నెలలకే సెంథిల్‌కుమార్‌ను బదిలీ చేయడం విచారకరం.

**- ఎన్.పవిత్ర, నెల్లూరు.**

### మస్తాన్‌బాబును గుర్తుపెట్టుకుందాం

నెల్లూరుజిల్లా ప్రజలంతా గర్వంగా చెప్పుకోదగ్గ పర్వతారోహకుడు మల్లి మస్తాన్‌బాబు. ప్రపంచంలోని ఏడు ఖండాలలో ఎత్తైన శిఖరాలను అధిరోహించిన ధీశాలి. మస్తాన్‌బాబు సజీవంగా ఉండుంటే చరిత్రలో భారత దేశం తరపున మరెన్నో రికార్డులను సృష్టించేవాడు. మస్తాన్‌బాబు సాహస కార్యాలను భావితరాలకు తెలిపే విధంగా అతని వ్యక్తిగత చరిత్రను బుక్‌లెట్‌గా ప్రచురించి విద్యార్థులకు పంపిణీ చేయాలి.

**జి.ఎస్.రెడ్డి, నెల్లూరు.**

### ఇంటర్వ్యూలో అన్యాయం

ఇటీవల నెల్లూరుజిల్లాలో టి.బి.ఆసుపత్రిలో ఇంటర్వ్యూలు జరిగాయి. బోర్డు మెంబర్లు, డిఎం అండ్ హెచ్ఓ, టిబి ఆఫీసర్, ఏజేసీ ఇంటర్వ్యూలు చేసారు. విచిత్రమేమంటంటే టిబి విభాగంలో సుదీర్ఘకాలం పనిచేసి ఎంతో అనుభవం వున్న నాకు కాకుండా ప్రైవేట్ కాలేజీలో డొనేషన్‌లు కట్టి ఏ అనుభవం లేని వారికి ఉద్యోగమిచ్చారు. ధనవంతుడైన ఒక డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ కూతురుకు కూడా ఉద్యోగమిచ్చారు. వీళ్ల పాపాలను ఆ ఏసయ్యే చూసి శిక్షిస్తాడు.

**- డా॥ ఆర్.రాజేంద్రకుమార్.**

### కోటంరెడ్డి పనితీరు బాగుంది

నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పనితీరు బాగుంది. అసెంబ్లీ సమావేశాలలో బాగా రాణించారు. సమస్యలపై ప్రజావాణిని అసెంబ్లీలో వినిపించిన దిట్ట ఆయన. గతంలో అసెంబ్లీలో ప్రజాసమస్యలపై పోరాడిన యం.వెంకయ్యనాయుడు తరహాలోనే కోటంరెడ్డి ప్రజల పక్షాన గళం విప్పుతుండడం అభినందనీయం.

**- బి.ఆర్.శాలి, కావలి.**

### గాడిన పెట్టే దశలో బదిలీ

జిల్లాలో పోలీసుశాఖను గాడిన పెట్టే దశలో ఎస్పీగా సెంథిల్‌కుమార్ బదిలీ కావడం అన్యాయమే. ఎర్రచందనం స్మగ్లర్ల ఆట కట్టించారు. ఇసుక, బియ్యం మాఫియాను కట్టడి చేశారు. 240 రోజులు 24X7లా పని చేశారు. కొత్త ఎస్పీ డాక్టర్ గజరావు భూపాల్ కూడా ఇంతకంటే సమర్ధవంతంగా పని చేయాలని ఆకాంక్షిస్తున్నాం. కొత్త ఎస్పీనైనా కనీసం రెండేళ్లపాటన్నా పనిచేయించాలి.

**- వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

# పనులకు తగ్గట్టే పన్నులు

**మున్సిపల్ మంత్రి ఇలాఖాలో వసూలు కాని పన్నులు**

***రాష్ట్రంలో 13మున్సిపల్ కార్పొరేషన్‌లు ఉన్నాయి. వాటిన్నింటితో పోలిస్తే పన్నుల వసూళ్లలో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ చివరి స్థానంలో నిలిచింది. మున్సిపల్ మంత్రి నారాయణకు ఇది ప్రిస్టేజీగా మారింది. ఈమధ్య ఓ సమావేశంలోనూ ఆయన నెల్లూరు కార్పొరేషన్ వాళ్లను చెడామడా వాయించాడు. జనాభా తక్కువ వున్న తిరుపతి, చిత్తూరు కార్పొరేషన్‌లు పన్నుల వసూళ్లలో ముందున్నాయని, నెల్లూరులో ఏడు లక్షల మంది ఉన్నారని, పన్నులు వసూలు చేయకుండా మీరేం పీకుతున్నారంటూ ఆయన ధ్వజమెత్తారు.***



ఈ సంవత్సరం జనవరి నాటికి ప్రభుత్వ కార్యాలయాల నుండి 9.50కోట్లు, ప్రైవేట్ కార్యాలయాల నుండి 21కోట్లు పన్నుల బకాయిలున్నాయి. వీటికి వడ్డీ కలిపితే 45కోట్లయ్యాయి. కమిషనర్ చక్రధర్‌బాబు జనవరి నుండే పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టినప్పటికి సిబ్బంది ఫిబ్రవరిలో గాని పన్నుల వసూలుకు పూర్తి స్థాయిలో రంగంలోకి దిగలేకపోయారు. ఇక పన్నుల వసూలుకు కార్పొరేషన్ సిబ్బంది ఎప్పుడూ లేని వికృత చేష్టలకు పాల్పడ్డారు. పన్నులు కట్టని వారి ఇళ్ల ముందు చెత్తపోయడం, పన్నులు కట్టని వారి పేర్లను మైకులో చెప్పడం, పన్నులు కట్టని దుకాణాల ముందు కూర్చుని సిబ్బంది నిరసన వ్యక్తం చేయడం వంటి ఛండాలమంతా చేశారు. ఇంత చేసినా ఈనెల మొదటి వారం వరకు వసూలైన పన్నులు 14కోట్లు మాత్రమే.

గత కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నంతవరకు ప్రతి ఏటా పన్నులకు వడ్డీ రాయితీ ఇచ్చి కట్టించుకుంటుండే వాళ్లు. ప్రజలకు కూడా ఈ వడ్డీ రాయితీ బాగా అలవాటైపోయింది. ఈ సంవత్సరం కూడా వడ్డీ రాయితీ ఇచ్చాక కడదామని చాలామంది అనుకున్నారు. కాని ఈ ప్రభుత్వం ఎలాంటి వడ్డీ రాయితీ ఇవ్వలేదు. దీంతో పన్నులు చెల్లించేవారిలో నిరాశ అలుముకుంది. చాలామందికి వడ్డీతో కలిపి పన్నులను కట్టడమంటే కష్టంగా అనిపిస్తుంది. మున్సిపాల్టీకి కట్టే పన్ను దండగ కార్యక్రమమనిపిస్తుంది వారికి!

దీనికి కారణం లేకపోలేదు. నెల్లూరు నగరపాలక సంస్థలో కొత్త పాలక వర్గం వచ్చాక నగరం మొత్తమ్మీద ఒక్క అభివృద్ధి పని కూడా కనిపించడం లేదు. ఒక రోడ్డు లేదు, డ్రైనేజీ లేదు, దోమలను నిర్మూలించడానికి ఫాగింగ్ చేయడం లేదు, ఏం చించుతున్నారని మీకు పన్నులు కట్టాలని నిలదీసే ధోరణిలో నెల్లూరు జనం ఉన్నారు.

# కమల వికాసం జరిగేనా?



***టార్గెట్-2019... రాష్ట్రంలో బీజేపీ లక్ష్యం ఇది. అప్పుడు జరిగే ఎన్నికల నాటికి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే స్థాయికి పార్టీని తీసుకెళ్లాలనేది బీజేపీ నాయకుల ఆలోచన. మొన్న పార్టీ రాష్ట్ర నాయకులు సోము వీర్రాజు కూడా ఈ విషయాన్ని బహిర్గతం చేసారు. దక్షిణాది రాష్ట్రాల్లో కూడా బలంగా పాతుకుపోవాలని బీజేపీ అధిష్టానం భావిస్తోంది. ఈ దిశగానే ఆంధ్రా, తెలంగాణలలో రాజకీయ పరిస్థితులపై ఆ పార్టీ అధిష్టానం దృష్టిని కేంద్రీకరించింది.***

ఒక రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకురావాలంటే వార్డు స్థాయి నుండి రాష్ట్ర స్థాయి దాకా అన్ని దశలలోనూ పార్టీ కేడర్ బలంగా వుండాలి. ఇప్పటికైతే ఆ పార్టీలో అలాంటి వాతావరణమే లేదు.

ముఖ్యంగా కేంద్రమంత్రి, జాతీయ బీజేపీ నాయకుడు, రాష్ట్రంలో ఆ పార్టీకి పెద్దదిక్కు యం.వెంకయ్యనాయుడు సొంత జిల్లాలోనే పార్టీ పరిస్థితి ఏ విధంగా ఉందో చూద్దాం... బీజేపీ పార్టీ పెట్టాక జిల్లాలో ఆ పార్టీ తరపున గెలిచిన ఏకైక ఎమ్మెల్యే వెంకయ్యనాయుడే! అది కూడా 1983లో ఆయన ఉదయగిరి నుండి గెలిచారు. ఆరోజు జిల్లాలో బీజేపీ కేడర్ కొంత బలంగానే వుండింది. ఆ తర్వాత ప్రతి ఎన్నికలకు క్రమక్రమంగా బలహీన పడుతూ వచ్చింది. ప్రతి ఎన్నికల్లోనూ బీజేపీ, టీడీపీతో పొత్తుతోనో లేదంటే ఒంటరిగానో పోటీచేస్తూ వస్తుంది. నెల్లూరు లోక్‌సభ స్థానంతో పాటూ జిల్లాలో పలు అసెంబ్లీలకు ఎన్నోసార్లు పోటీ చేశారు. టీడీపీతో పొత్తుపెట్టుకున్నప్పుడు తప్పితే ఒంటరిగా పోటీ చేసిన సందర్భాలలో గణనీయంగా ఓట్లు సాధించింది కూడా లేదు. ఎప్పటికప్పుడు ఆ పార్టీకి పడే ఓటింగ్ శాతం తగ్గుతూ వచ్చింది.

2014లో నరేంద్ర మోడీ ప్రభంజనం దేశవ్యాప్తంగా వున్నప్పుడు కూడా నెల్లూరు జిల్లాలో ఆ పార్టీ చెప్పుకోదగ్గ ఓట్లను సాధించ లేకపోయింది. తిరుపతి పార్లమెంట్, నెల్లూరురూరల్ అసెంబ్లీలో బీజేపీ పోటీ చేసింది. రెండుచోట్లా ఓడిపోయింది.

సరే, ఇప్పటివరకు ఇలా అయ్యింది. ఇకముందు జిల్లాలో ఆ పార్టీ బలపడడానికి ఉన్న అవకాశాలేమిటి? పార్టీ బలోపేతం కావాలంటే ఉన్న కేడరు, లీడర్లు చాలరు. కొత్త నీరు రావాలి. ఆర్థికంగా కూడా బలవంతులు కావాలి. రాజకీయాలలో ఇది తప్పనిసరైంది. ఎన్నికలకు ముందు జిల్లాలో కాంగ్రెస్ నాయకులు కొందరు తెలుగుదేశంలో చేరిపోయారు. వాళ్లు ఇప్పుడు బీజేపీలోకి వచ్చే పరిస్థితి లేదు. ఈమధ్యనే నేదురుమల్లి తనయుడు రాంకుమార్‌రెడ్డి బీజేపీలో చేరారు. దీనివల్ల పార్టీకి కొంతవరకు ప్రయోజనమే కాని పూర్తిస్థాయిలో ఒరిగేదేమీ లేదు. ఇప్పటికే నాయకులు, పెద్ద రాజకీయ కుటుంబాలు వైకాపా, తెలుగుదేశంలలో వున్నాయి. ఆనం కుటుంబం కాంగ్రెస్‌లో వుంది. ఈ మూడు పార్టీల నుండి కొంత కేడర్ కదలి వచ్చి బీజేపీలో చేరితేనే ఆ పార్టీ జిల్లాలో పుంజుకునే అవకాశాలున్నాయి.

# చెరువులు మింగేస్తాయి జాగ్రత్త!



వేసవి సెలవుల్లో పిల్లలపై ప్రత్యేకశ్రద్ధ అవసరం

వేసవి సెలవులు... పిల్లలకు సరదాగా ఉంటుంది. కాని ఒక్కోసారి ఆ సరదానే ప్రాణాలమీదకి తెస్తుంది. ముఖ్యంగా చెరువుల్లో ఈతకొట్టాలనే సరదా పిల్లల ప్రాణాలు తీస్తుంది. చెరువుల్లో ఈత కొట్టడానికి వెళ్లడం, లోతుపై అవగాహన లేక గుంతల్లో మునిగిపోయి చనిపోవడం సర్వసాధారణంగా జరుగుతుంది. మొన్న ఆదివారం దగదర్తి మండలం సున్నపుబట్టీ వద్ద చెరువులో ఈతకు వెళ్లి విశాల్, పవన్, అజయ్ అనే చిన్నారులు మృత్యువాత పడ్డారు. చెరువులో ఈతకు వెళ్లిన ఈ చిన్నారులు గ్రావెల్ కోసం తవ్విన గుంటలో మునిగిపోయి మృతి చెందారు. జిల్లాలో గతంలోనూ ఇలాంటి సంఘటనలు చాలానే జరిగాయి. వీటిలో ఎక్కువ మంది చిన్నారులే బలయ్యారు.

ఈ నెలాఖరులో వేసవికాలం సెలవులు మొదలు కానున్నాయి. నగరంతో పాటు ప్రధాన పట్టణాలలో పిల్లల కోసం సమ్మర్ స్పెషల్ క్యాంప్‌లు పెడుతుంటారు. కాబట్టి ఇక్కడ సమస్య లేదు. గ్రామాల్లో పిల్లలకు ప్రత్యేక సమ్మర్ క్యాంపులేమీ ఉండవు. సెలవులొచ్చాయంటే చెట్లు, పుట్టలు, పొలాలగట్ల మీద తిరుగుతుంటారు. ఇక ఎండల దెబ్బకు ఈతకొట్టాలనే కోరిక సర్వసాధారణంగానే కలుగుతుంది. పిల్లలతో కలిసి ఆ పరిసరాల్లో ఆడుకుంటూనే తల్లిదండ్రులకు చెప్పాపెట్టకుండా పిల్లలు సమీప చెరువుల వద్దకు పోతారు. లోతు తక్కువుగా ఉంటుందనే భ్రమతో నీళ్లలో దిగేస్తారు. చెరువుల్లో మట్టి తోలకాలు జరుగుతుంటాయి. గ్రావెల్‌ను తవ్వేస్తుంటారు. దీంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ఉంటాయి. పిల్లలు వీటిల్లో పడి ప్రాణాలు కోల్పోతుంటారు. అలాంటి చెరువులు తమ గ్రామాలలోవుంటే తల్లిదండ్రులు తమ పిల్లలను అటు వైపు పోనీయకుండా అప్రమత్తంగా వుండి కాపాడుకోవాలి.

# తడలో టెర్రర్?



ఆంధ్రా-తమిళనాడు సరిహద్దుల్లోని తడ ప్రాంతంలో 'సిమి' ఉగ్రవాదులు తల దాచుకున్నారనే ప్రచారం కొద్ది నెలల క్రితం జిల్లాలో కలకలం రేపింది. చెన్నై రైల్వేస్టేషన్‌లో జరిగిన బాంబు దాడి కేసులో నిందితుల ఊహాచిత్రాలను రెండు నెలల క్రితం ఆరంబాకం పోలీసులు తడ పోలీసులకిచ్చి వెళ్లారు. ఈ ఊహాచిత్రాలను తడ ప్రాంతంలో అంటించారు. అంతకు కొంతకాలం క్రితమే పుత్తూరులో ఉగ్రవాదులు తల దాచుకున్న సంఘటన వెలుగులోకి వచ్చింది. దీంతో తడలోనూ ఉగ్రవాదులు తలదాచుకునే అవకాశముందనే ప్రచారం జోరుగా సాగింది. అప్పట్లో పోలీసు వర్గాలలో ఇది కలకలం సృష్టించింది. ముఖ్యంగా తడ సమీపంలో పులికాట్ సరసు, అందులో కొన్ని దీవులు ఉండడం, పడవల ద్వారా ఉగ్రవాదులు రాకపోకలు సాగించేందుకు అవకాశం ఉండడంతో ఆ విధంగా అనుమానాలు పెరిగాయి.

మొన్న నల్గొండ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన ఉగ్రవాదులు అప్పట్లో తడలో తలదాచుకుని ఉన్నారనే ప్రచారం ఇప్పుడు మరింత ఆందోళన కలిగిస్తుంది. మధ్యప్రదేశ్‌లో ఖ్వాండా జైలు నుండి మొత్తం 5మంది ఉగ్రవాదులు తప్పించుకున్నారు. వారిలో ఇద్దరు ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. మిగతా ముగ్గురు ఎక్కడ తలదాచుకుని ఉంటారనేదానిపై ఆందోళన కలుగుతుంది. ఏదిఏమైనా సిమి ఉగ్రవాదుల కార్యకలాపాల పట్ల జిల్లా పోలీసు యంత్రాంగం కూడా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది.

# పుణ్యకాలం గడిచిపోతుంది

## పదవులిచ్చి వుంటే ఒక బ్యాచ్ ముగిసేది!

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి పదినెలలు దాటింది. ఇంకో రెండు నెలలకు సంవత్సరం. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే నామినేటెడ్ పదవులు ఇచ్చేసి వుంటే ఈపాటికి పదవులను వదులుకోవడానికి మొదటి బ్యాచ్ సిద్ధంగా ఉండేది. ఎందుకంటే చంద్రబాబు చాలా రకాల నామినేటెడ్ పదవుల కాలాన్ని ఒక్క ఏడాదికే పరిమితం చేశారు.

ముఖ్యంగా దేవస్థానాల పాలక కమిటీల పదవీకాలం రెండేళ్లు ఉండేది. చంద్రబాబు వచ్చి దానిని సంవత్సరానికి తగ్గించారు. సరే, ఆ పదవులేవో ఇస్తే ఒక సంవత్సరమన్నా వెలగబెడదామని తెలుగు తమ్ముళ్లు ఆశపడ్డారు. కాని చంద్రబాబు ఇస్తేనా? టీటీడీ ఛైర్మెన్, పాలకవర్గ సభ్యులను భర్తీ చేసివుంటే ఇంకో రెండు నెలల్లో మొదటి బ్యాచ్ వెళ్లిపోయి ఉండేది. ఆ తర్వాత ఇంకో కొత్త బ్యాచ్‌కు పదవులు ఇచ్చి కొంతమందిని సంతృప్తి పరిచేదానికి అవకాశముండేది. నెల్లూరుజిల్లాలో ఆదాయపరంగా, ఆధ్యాత్మిక చరిత్రపరంగా పలు పెద్ద దేవస్థానాలున్నాయి. నెల్లూరులో శ్రీ తల్పగిరి రంగనాథస్వామి ఆలయం, మూలాపేట శివాలయం, ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం, జొన్నవాడ కామాక్షమ్మ దేవస్థానం, నరసింహకొండ దేవస్థానం, పెంచలకోన దేవస్థానం, కొండబిట్రగుంట ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయం, సూళ్లూరుపేట చెంగాళమ్మ దేవస్థానం వంటి వాటి ఛైర్మెన్‌లు, సభ్యుల పదవులకు డిమాండ్ ఎక్కువుగా ఉంటుంది. దాదాపు పది నెలలుగా ఈ పదవుల కోసం వందల సంఖ్యలో తెలుగు దేశం నాయకులు ప్రయత్నాలు చేస్తూనే వున్నారు. ఈ నెల, వచ్చే నెల అంటూ పది నెలలు లాక్కొచ్చారు. ఆశావహులలో కొందరికి పదువులు ఇచ్చేసుంటే ఒక బ్యాచ్ వెళ్లిపోయేది. పదవులు వచ్చాయని కొందరన్నా సంతృప్తి చెందేవాళ్లు. కాని ఇక్కడ ఖాళీగా వున్న కుర్చీలను చూస్తూ, మరోపక్క కరుగుతున్న కాలాన్ని గమనిస్తూ నామినేటెడ్ పదవులపై ఆశలు పెంచుకున్న తెలుగు తమ్ముళ్లు పడుతున్న బాధ వర్ణనాతీతం.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

నెల్లూరు కబుర్లు



# విగ్రహ వివాదం

భారతదేశంలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలలో చదువుల తల్లి సరస్వతి విగ్రహాలు ఉంటాయి. మైనార్టీ విద్యా సంస్థలలో మాత్రం ఉండవు. చదువుల తల్లిగా పేరుగాంచింది కాబట్టి సరస్వతీ దేవిని విద్యార్థులు పూజిస్తుంటారు. విద్యాభ్యాసం కూడా సరస్వతీపూజతోనే మొదలు పెడుతుంటారు.

అయితే ఇప్పుడు నెల్లూరులోని విఆర్ విద్యాసంస్థల ముందు జీసెస్ విగ్రహాన్ని పెట్టడం వివాదాస్పదంగా మారింది. వందేళ్ల చరిత్రగల విఆర్ విద్యాసంస్థలలో ఎప్పుడూ మత పరమైన వివాదాలు లేవు. ఇటీవల విఆర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలోనే వైఎంసిఏ గ్రౌండ్‌లో పెద్ద కళాశాల భవనం కట్టారు. ఈ గ్రౌండ్ క్రిస్టియన్ సంస్థలది. స్థలం ఇచ్చినందుకు కృతజ్ఞతగా కాంగ్రెస్ అధికారంలో వున్నప్పుడు విఆర్ విద్యాసంస్థల కరస్పాండెంట్, ఆరోజు ఎమ్మెల్యేగా వున్న ఆనం వివేకానందరెడ్డి ఇక్కడ బాలయేసు మందిరాన్ని నిర్మించారు. అయితే హిందూ కళాశాలగా పేరుగాంచిన విఆర్ విద్యాసంస్థల ప్రాంగణంలో అన్యమత విగ్రహాలు ఏంటంటూ అప్పుడే బీజేపీ, విశ్వహిందూ పరిషత్, ఏబివిపి వంటి సంస్థలు ఆందోళనకు దిగాయి. అయినా వివేకా లెక్కచేయకుండా బాలయేసు మందిరాన్ని ప్రారంభించారు. అయితే ఇక్కడితో ఆయన సంతృప్తి చెందలేదేమో తాజాగా వైఎంసిఏ గ్రౌండ్ ముందు బ్రెజిల్‌లో వున్న ఏసు ప్రభువు విగ్రహం తరహాలో ఇక్కడ విగ్రహం పెట్టారు. దీనిపై మళ్లీ ఏబివిపి, విహెచ్‌పి వంటి సంస్థలు ఆందోళనకు, ధర్నాలకు దిగాయి. కాని వివేకా మాత్రం ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా యేసు ప్రభువు బొమ్మను నిలబెట్టాడు. ఏ అనుమతి లేకుండా ఈ విద్యాసంస్థలో విగ్రహాలు ఎలా పెడతారంటూ హిందూత్వవాదులు మండిపడుతున్నారు.

# వేణుగోపాలుని రథోత్సవం



నెల్లూరు మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం వారు నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ఉభయదేవేరులతో శ్రీ స్వామివారు రథంపై ఊరేగుతూ కనువిందు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాస అయ్యంగార్ శాస్త్రోక్తంగా కార్యక్రమాలను నిర్వహించారు. మూలాపేట ప్రధానవీధుల గుండా సాగిన రథోత్సవానికి భక్తులు రంగవల్లులు వేసి స్వాగతం పలికారు. కర్పూరహారతులతో, టెంకాయలు కొట్టి విశేషపూజలు నిర్వహించారు. పేటేటి రాఘవరావు దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. బ్యాండు మేళాలు, తప్పెట్లు, కోలాటాలు, డప్పులు, కీలుగుర్రాలు, పులివేషాల ప్రదర్శనలతో, భక్తి సంకీర్తనల నడుమ యువత ఆనందోత్సాహాలతో రథాన్ని లాగుతూ సందడి చేశారు. ఆలయ మేనేజర్ కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. రాత్రి జరిగిన కార్యక్రమంలో శ్రీ స్వామివారు పుష్పక విమాన ఉత్సవంలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఉత్సవానికి సాగిరాజు వెంకటరాజు, సునీత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా బాలత్రిపురసుందరి నృత్యనికేతన్ వారిచే కూచిపూడి, భరతనాట్య నృత్య ప్రదర్శనలు భక్తులను అలరించాయి.



# పిచ్చిరెడ్డి సంస్మరణ

నెల్లూరు మాగుంట లే-అవుట్‌లోని సిపిఆర్ కల్యాణ మండపంతో పాటు ట్రంకురోడ్డులోగల శివప్రియ లాడ్జి అధినేత చెరుకుపల్లి పిచ్చిరెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన స్వగృహంలో సంస్మరణ కార్యక్రమం ఏప్రియల్ 7వ తేదీ ఉదయం జరిగింది. ఈ కార్యక్రమంలో పిచ్చిరెడ్డి కుటుంబసభ్యులతో పాటు నగరానికి చెందిన పలువురు పిచ్చిరెడ్డి కుటుంబ ఆప్తులు, పురప్రముఖులు పాల్గొన్నారు.

● వాహన వితరణ

# అనాథలపై వేమిరెడ్డి 'వాత్సల్యం'




జిల్లాలో ఎన్నో సేవాకార్యక్రమాలకు భూరి విరాళాలిచ్చిన ప్రముఖ సేవా శిఖరం వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నెల్లూరు, కొండాయపాలెంరోడ్డులోని వాత్సల్య అనాథాశ్రమాన్ని ప్రత్యేక ప్రేమతో చూస్తుంటారు. తల్లిదండ్రులు లేక ఆలనా పాలనా కరువైన చిన్నారులను వాత్సల్య అక్కున చేర్చుకుని ఆదరిస్తున్న తీరు ఆయనను ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఆ ప్రేమ, నమ్మకంతోనే వాత్సల్యకు ఎన్నో విధాలుగా చేయూతనందిస్తుంటారాయన. ఈ నెల 8న వాత్సల్యకు చెందిన భారతీయ విద్యావికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌కు తమ తల్లి జ్ఞాపకార్థంగా ఆయన నూతన బస్సును బహూకరించారు.

ఈ కార్యక్రమంలో నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సింహపురి వైద్యసేవా సమితి అధ్యక్షులు పొన్నలూరు సీతారామిరెడ్డి, ప్రముఖ గుండెవ్యాధి నిపుణులు డాక్టర్ సి.శ్రీనివాసరాజు, జనహిత గౌరవాధ్యక్షులు సామంతు గోపాల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డిఎఫ్ఓగా శ్రీకంఠనాథ్‌రెడ్డి

నెల్లూరుజిల్లా అటవీశాఖాధికారిగా శ్రీకంఠనాథ్‌రెడ్డిని నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. శ్రీకంఠనాథ్‌రెడ్డి చిత్తూరుజిల్లాలో డిఎఫ్ఓగా పనిచేస్తూ సెలవులో ఉన్నట్లు సమాచారం. సోమవారం ఆయన జిల్లా అటవీ శాఖాధికారిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. దాదాపు 15నెలలుగా ఖాళీగా వున్న ఈ పోస్టులో నలుగురు ఇన్‌ఛార్జి డిఎఫ్ఓలుగా బాధ్యతలు నిర్వహించారు.

# ఎస్పీతో అక్టోపస్ కమాండర్స్

సిమి ఉగ్రవాదులు తడలో సంచరిస్తున్నారనే అనుమానాలున్న నేపథ్యంలో ఆక్టోపస్ కమాండర్స్ ఎస్.ఎస్.భాషా, రాజ్‌కుమార్‌లు సోమవారం జిల్లా ఎస్పీ గజరావు భూపాల్‌ను కలిసారు. పలు విషయాలపై వారు ఎస్పీతో చర్చించారు.

# హజ్ ఛార్జీలను తగ్గించాలి

కేంద్రప్రభుత్వం పెంచిన హజ్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు అబ్దుల్ సమీ డిమాండ్ చేశారు. పేద మధ్య తరగతి ప్రజలు పవిత్రమైన హజ్‌యాత్రకు వెళ్ళాలంటే భయమేస్తుందని, కాబట్టి పెంచిన ఛార్జీలను తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో సందాని, రషీద్, జిలాని, రబ్బాని, కరీం, బషీర్, అన్మర్, అన్వర్‌లు పాల్గొన్నారు.

# అన్నదానం



నేతాజీ పైలట్ హైస్కూలు అధినేత జడ్.శ్రీనివాసులురెడ్డి తల్లి స్వర్గీయ జక్కం కాంతమ్మ 10వ వర్ధంతి సందర్భంగా గీతామయి వృద్ధుల ఆశ్రమంలో అన్నదానం, వస్త్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ వ్యవస్థాపక నిర్వాహకులు తమ్మినేని పాండు, సరళ పాల్గొన్నారు.

# మే31 దాకా సెలవులే

మే 31వ తేదీ దాకా కళాశాలలకు వేసవి సెలవులుంటాయని ఆర్ఐఓ వై.పరంధామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 1వ తేదీ నుండి మాత్రమే కళాశాలలను తెరవాలన్నారు. ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు కూడా ఈ నిబంధనలను పాటించాలని, వేసవి సెలవుల్లో ఎవరైనా తరగతులు నిర్వహిస్తే ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# చెన్నై నెల్లూరీయుల్లో టెన్షన్ టెన్షన్

మంగళవారం శేషాచలం అడవుల్లో 20మంది ఎర్రచందనం కూలీలు ఎన్‌కౌంటర్‌లో మరణించారు. వీరంతా తమిళనాడుకు చెందినవాళ్లే! దీంతో చెన్నైలో ఉన్న తెలుగోళ్లు, ముఖ్యంగా నెల్లూరీయులకు టెన్షన్ మొదలైంది. తమిళులకు ప్రాంతీయ అభిమానం ఎక్కువ. ఒక కాకి చనిపోతే వందకాకులు అరుస్తాయి. అలాంటి ఐక్యతే తమిళుల్లో కూడా ఉంటుంది. తమ వాళ్లు చనిపోతే వాళ్లు తీవ్రంగా స్పందిస్తారు. మంగళవారం కూడా ఇదే విధంగా జరిగింది. తమిళ సంఘాలు ఎన్‌కౌంటర్‌పై భగ్గుమన్నాయి. చెన్నైలోని తెలుగు సంస్థల ముందు భారీ భద్రత పెంచారు. ముఖ్యంగా నెల్లూరు నుండి చెన్నైకు వెళ్లే ప్రయాణీకులు ఇబ్బంది పడ్డారు. కొందరైతే ప్రయాణాలు కూడా మానుకున్నారు. గురువారం కూడా నెల్లూరు నుండి చెన్నైకు బస్సులు కదలలేదు.

# మహిళలకు అన్యాయం

చంద్రబాబు పాలనలో మహిళలకు ఏ మాత్రం న్యాయం జరగడంలేదని జిల్లా మహిళాకాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి పందిళ్లపల్లి అరుణమ్మ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే బెల్టు షాపులను తీసేస్తానన్నాడు. ఇంతవరకు ఒక్క బెల్టుషాపును కూడా తొలగించలేదు. మహిళలు అర్థరాత్రిళ్లు కాదు కదా పగలు కూడా వీధుల్లో తిరగలేని పరిస్థితులొచ్చాయి. నిత్యావసర ధరలు నింగినంటాయి. డ్వాక్రా ఋణాల మాఫీ లేదు. ఇంటి పన్నులపై వడ్డీ తగ్గించలేదు. వంటగ్యాస్‌కు ఆధార్‌కు లింకుపెట్టి మహిళలను అగచాట్లు పెడుతున్నారని ఆమె ఆరోపించారు.

# ఎస్బీ సిఐగా సీతారామయ్య

నెల్లూరు స్పెషల్ బ్రాంచ్ సిఐగా సిహెచ్ సీతారామయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. 2002 బ్యాచ్‌కు చెందిన సీతారామయ్య దుత్తలూరు, ముత్తుకూరు, మర్రిపాడు, అయిదవ నగర పోలీసుస్టేషన్లతో పాటు డిటిసిలో ఎస్సైగా విధులు నిర్వహించారు. 2011లో సిఐగా పదోన్నతి పొంది గుంటూరు మహిళా పోలీసుస్టేషన్ సిఐగా, కోర్టు మానిటరింగ్ స్పెషల్ ఆఫీసర్‌గా పనిచేశారు. గుంటూరు విఆర్‌కు వెళ్ళి అనంతరం స్పెషల్ బ్రాంచి సిఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ గజరావు భూపాల్, అదనపు ఎస్పీ రెడ్డి గంగాధరరావు, ఎస్బీ డిఎస్పీలు రామారావు, పోతురాజులను మర్యాదపూర్వకంగా కలిసారు.

# మస్తాన్‌బాబుకు బల్బుతో నివాళి



పర్వతారోహకుడు మల్లి మస్తాన్‌బాబుకి నివాళిగా నెల్లూరుజిల్లా ఖాజానాశాఖలో సీనియర్ సహాయకులుగా పనిచేస్తున్న సూక్ష్మచిత్ర కళాకారుడు కాళహస్తి వెంకటశేషగిరిరావు బల్బులో "మల్లి అమర్ రహే!!" అని ఈ చిత్రాన్ని తీర్చిదిద్దారు.

## శ్రీ షిర్డి సాయిబాబా, శ్రీ యోగాంజనేయస్వామివార్ల

# ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు





ఇందుకూరుపేట మండలంలోని కొత్తూరు గ్రామంలో వెలసివున్న శ్రీ షిర్డి సాయిబాబా మరియు శ్రీ యోగాంజనేయస్వామి వార్ల ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు అయిదురోజుల పాటు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. అత్యద్భుతంగా నిర్మితమైన ఈ ఆలయాల్లో అయిదురోజుల వేడుకలు భక్తాదులకు ఎంతో కను విందు చేయనున్నాయి.

కొత్తూరులోని శ్రీ షిర్డి సాయిబాబా మందిరం ట్రస్ట్ నిర్వాహకులైన ప్రముఖ వదాన్యులు శ్రీమతి కలికి శ్రీలత- శ్రీ కలికి  కోదండరామి రెడ్డిలు ఈ బ్రహ్మోత్సవాలకు ధర్మకర్తలుగా వ్యవహరిస్తారు. ఈ నెల 11 నుంచి 15వ తేది దాకా జరిగే ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా,  శ్రీ సాయిబాబా మందిరంలో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 12వ తేదీ కుంభాభిషేకం, మహామంగళహారతులను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఆరోజు సాయంత్రం 6గంటల నుండి 8.30గంటల వరకు సాయిబాబా వారి మహాపూజ, పల్లకీసేవ, అష్టావదాన సేవ, మహామంగళహారతులు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఇక శ్రీ యోగాంజనేయ మందిరంలో 13వ తేదీ నుండి 15వ తేదీ వరకు ప్రత్యేక పూజలు హోమాలు, పూర్ణాహుతి, మంగళహారతి వంటి పూజలు ఉదయం, సాయంత్రం వేళల్లో జరగనున్నాయి. 14వ తేదీ సాయంత్రం 4.30గంటల నుండి 10.00గంటల వరకు గణపతిపూజ, ప్రాయశ్చిత్తహోమం, అష్టావదాన సేవ, శ్రీరామ ఆంజనేయ పరివార దేవతామూర్తుల ప్రాకారోత్సవం, గ్రామోత్సవం వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. 15వ తేదీ ఉత్సవాల ముగింపురోజు శ్రీ యోగాంజనేయ మూలమంత్ర హోమం, మహాపూర్ణాహుతి, సామూహిక ప్రార్థనలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ధర్మకర్తలు శ్రీమతి కలికి లలిత - కలికి కోదండరామిరెడ్డిలు కోరుతున్నారు.




# ముగిసిన టౌన్‌హాలు శతాబ్ది వేడుకలు





ఈ నెల 6న ప్రారంభమైన టౌన్‌హాలు శతాబ్ది వేడుకలు 9వ తేదీతో ముగిసాయి. తొలిరోజు ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం, ప్రముఖ సినీ కవి వెన్నెలకంటి పాల్గొని టౌన్‌హాలుతో తమకున్న అనుబంధాన్ని వివరించారు. చరిత్రకు చేవ్రాలు నెల్లూరు టౌన్‌హాలు అని అంటూ ప్రశంసించారు. తన తండ్రి పండితారాధ్యుల సాంబమూర్తి విగ్రహాన్ని టౌన్‌హాల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసేందుకు ట్రస్టు కమిటీ వారు ఆలోచించాలని ఈ సందర్భంగా ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం కోరారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు జీవితసాఫల్యం పురస్కారాలను అందజేశారు. పురస్కారాలందుకున్న వారిలో ముదివర్తి కొండమాచార్యులు, పొన్నాల రామసుబ్బారెడ్డి, కనుపర్తి వెంకటరమణయ్య, డాక్టర్ ఏ.వి.సుబ్రహ్మణ్యం, ఎం.వి. రమణారెడ్డి, రాళ్లపల్లి సుబ్బలక్ష్మి, బి.వి.నరసింహం, పసుపులేటి రామ్మూర్తి, తిక్కవరపు సుకుమార్‌రెడ్డి, డాక్టర్ జగదీష్‌లతో పాటు పురమందిరి పునర్నిర్మాత జె.యస్.రెడ్డి, ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం ఉన్నారు. పురమందిరం చరిత్రను వివరిస్తూ రేబాల లక్ష్మీనరసారెడ్డి పాత్రలో ముదివర్తిపాలెం జడ్పీ పాఠశాల విద్యార్థిని షేక్ ఇలీషా నటన అందర్నీ ముగ్ధులను చేసింది. ఈ సందర్భంగా పలువురు ఆ చిన్నారికి నగదు ప్రోత్సాహం అందించారు. శతాబ్ది వేడుకల సందర్భంగా గురుకృప కళాక్షేత్రం చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

### పన్నులనుకుంటున్నావా?..

# నీ కాలేజీ ఫీజులనుకుంటున్నావా?

**- మంత్రిపై కోటంరెడ్డి నిప్పులు**



నెల్లూరు నగర ప్రజల నుండి ధౌర్జన్యంగా పన్నులు వసూలు చేయాలని చూస్తే చూస్తూ ఊరుకునేది లేదని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం నెల్లూరులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి నారాయణపై తీర్వంగా విరుచుకుపడ్డారు. నీ నారాయణ కాలేజీలలో విద్యార్థుల నుండి ఫీజులు వసూలు చేసినట్లు ఇక్కడ పన్నులు వసూలు చేయాలంటే కుదరదు. అనాగరికంగా పన్నులు వసూలు చేసే పద్ధతి మానుకోండి, మార్చుకోండి. పన్నులు కట్టకుంటే ఇళ్ల ముందు చెత్త పోయడం, కొళాయి కనెక్షన్ పీకేయడం వంటి చెత్తపనులు మానండి. మీరు పన్నులు వసూలు చేసే పద్ధతి చూస్తేనే తెలుస్తుంది, మీ కాలేజీలలో ఫీజుల కోసం విద్యార్థులను ఎంతగా వేధిస్తున్నారనే విషయం. నెల్లూరు మీ కాలేజీ కాదు... బలవంతంగా పన్నులు వసూలు చేయడానికి. నెల్లూరుజిల్లాలో ఏ ఒక్క అభివృద్ధి పని కోసం కూడా మీరు ఒక్క రూపాయి తేలేదు. ఇక నెల్లూరులో పన్నులు వసూలు చేసే హక్కు మీకెక్కడుందని మంత్రిని ఆయన ప్రశ్నించారు.

# ప్రజాప్రతినిధికే రక్షణ లేకుంటే ఎలా?

జిల్లా కొత్త ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన గజరావు భూపాల్‌ను ఈనెల 3వతేదీన నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యలు కలిసారు. మార్చి 31వతేదీన జలదంకి మండలం బ్రాహ్మణక్రాక గ్రామంలో జలదంకి జడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, వారి కుటుంబభ్యులపై జరిగిన అమానుష దాడిని వారు ఎస్పీతో ప్రస్తావించారు. ప్రజాప్రతినిధి అయిన మహిళా జడ్పీటీసీకే రక్షణ లేకపోతే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటని వారు ప్రశ్నించారు. ఈ కేసుపై నిష్పాక్షికంగా దర్యాప్తు జరిపి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు ఎస్పీని కోరారు.



# పారిశ్రామిక హబ్‌గా శ్రీసిటీ




నెల్లూరుజిల్లా సరిహద్దులోని శ్రీసిటి సెజ్‌లో పెప్సీకో ఇండియా స్థాపించిన ఆహార శీతలపానీయాల పరిశ్రమను ఈ నెల 3న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పెప్సికో ఛైర్మెన్ అండ్ సిఇఓ ఇంద్రనూయీ సంయుక్తంగా ప్రారంభించారు. అలాగే ఇక్కడ జరిగిన శ్రీసిటీ ప్రగతి ఉత్సవాలలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు మరో 11 పరిశ్రమలను ప్రారంభించడంతో పాటు ఇంకో 11కొత్త పరిశ్రమలకు భూమిపూజ నిర్వహించారు.

ఈ సందర్భంగా చంద్రబాబు తన ప్రసంగంలో శ్రీసిటీ ప్రగతిని అభినందించారు. దేశంలోనే శ్రీసిటీ ఒక పెద్ద పారిశ్రామిక హబ్‌గా మారనుందని చెప్పారు. రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చిన పెప్సీ యాజమాన్యాన్ని అభినందించారు. పెప్సీకో ఛైర్మెన్ అండ్ సిఇఓ ఇంద్రానూయీ మాట్లాడుతూ గత పాతికేళ్లుగా భారత్‌లో పెట్టుబడులు పెడుతున్నామని, భవిష్యత్‌లో మరిన్ని ప్లాంట్లు పెడతామన్నారు. శ్రీ సిటీలో నెలకొల్పిన పరిశ్రమకు ఏటా సుమారు 10లక్షల టన్నుల మామిడి గుజ్జు అవసరమవుతుందని, రైతుల నుండే ఈ గుజ్జును సేకరిస్తాం కాబట్టి, సుమారు 60వేల మంది రైతులకు లాభం చేకూరుతుందన్నారు. పెప్సీకి ఉన్న 38ప్లాంట్లలో ఇదే పెద్దదని చెప్పారు. శ్రీసిటీ యం.డి రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ దేశంలోనే అతిపెద్ద పెప్సీకో ప్లాంటును శ్రీసిటీలో నిర్మించడం వల్ల చిత్తూరుజిల్లాలో మామిడి, టమోటా రైతులకు లాభం చేకూరుతుందని, ఉపాధి పరంగా కూడా ఈ ప్రాంతానికి మేలు జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, పి.నారాయణ, ఎంపీ వరప్రసాదరావు, ఎమ్మెల్యే టి.ఆదిత్య, శ్రీసిటీ ఛైర్మెన్ శ్రీనిరాజు, రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎస్.ఎస్. రావత్, ఏపి ఐఐసి అధ్యక్షులు పి.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## న్యాయసేవలు సద్వినియోగించుకోవాలి

- జడ్జి గురప్ప




మాట్లాడుతున్న జడ్జి గురప్ప

న్యాయసేవలను ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలని ఏడో అదనపు జిల్లా జడ్జి పి.గురప్ప అన్నారు. గూడూరులోని సబ్‌జైలులో 4వ తేదీ న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ న్యాయవాదిని ఏర్పాటు చేసుకోలేకపోతే ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. జైలులో వసతులు సరిగా లేకపోతే తెలియజేయాలని కోరారు. అనంతరం ఎక్కువకాలం జైలులో ఉన్నవారికి బెయిల్ రాకపోవడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఇంకా పలు సలహాలు సూచనలను అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు ఏడుకొండలు, సాయిరామ్, దివాకర్, జైలు సూపరింటెండెంట్ అస్లాం తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్

గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో 4వ తేదీ అంబేద్కర్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను 1వ పట్టణ ఎస్సై అజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వలన మానసిక ఉల్లాసం వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తితో ఆడాలన్నారు. అనంతరం టోర్నమెంట్‌ను ప్రారంభించారు. మొదటి మ్యాచ్ ఏసిసి సీనియర్స్, జేకే లెవన్స్ జట్లు తలపడగా జేకే లెవన్స్ విజయం సాధించింది. అనంతరం రెండవ మ్యాచ్ నెల్లూరుకు చెందిన ఎంఎల్‌టిసిసి, ఆర్సీసీ జూనియర్స్ జట్లు తలపడగా ఎంఎల్‌టిసిసి జట్టు విజయం సాధించింది.

## కొనసాగుతున్న దీక్ష


తమ సమస్యలు పరిష్కరించాలంటూ నెల్లటూరులోని విద్యుత్‌శాఖ స్టోర్సులో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ కార్మికులు చేస్తున్న నిరాహారదీక్షలు కొనసాగుతున్నాయి. న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని వారు పేర్కొన్నారు. దీనిపై ఆర్డీవో రవీందర్ స్పందించాలని కోరారు.

## జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు




మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, పక్కన ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన

గూడూరు పట్టణంలోని గడియారపు స్థంభం వద్ద ఆదివారం డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన మాట్లాడుతూ చదువు, తెలివి తేటలకు కులమతాలు అడ్డు రావన్నారు. కార్యక్రమంలో గూడూరు తహశీల్దార్ వెంకటనారాయణమ్మ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మందా కృష్ణయ్య, కౌన్సిలర్ శివకుమార్, భాస్కర్, శివయ్య, గోవిందు, నాగరాజు, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు. కాగా గూడూరు మండల తహశీల్దార్ కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా చిత్రపటానికి తహశీల్దార్ సి.వెంకటనారాయణమ్మ, రెవెన్యూ సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది కమలాకర్, రమణయ్య, నాగార్జునరెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.



గ్రీవెన్స్‌డేలో ఆర్డీవోకు అర్జీలు అందజేస్తున్న ప్రజలు

## ఆర్డీవోకు వినతులు

గూడూరులోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌డేలో సమస్యలు పరిష్కరించాలని పలు గ్రామాలకు చెందిన ప్రజలు ఆర్డీవో రవీందర్‌కు వినతులు అందజేశారు. వెంకటగిరి మండలం చెవిరెడ్డిపల్లిలో ఉన్న ప్రభుత్వ భూమిని చిత్తూరుజిల్లాకు చెందిన వారికి ఇచ్చారని గ్రామంలో భూమిలేక అనేకమంది ఎస్సీ, ఎస్టీలు ఉన్నారని, వారికి ఆ భూములు ఇవ్వాలని స్థానికుడు పోలయ్య, మాలమహానాడు రాష్ట్ర ప్రచారకార్యదర్శి అరవ పార్వతయ్యలు వినతిపత్రం అందజేశారు. ఇంకా పలు సమస్యలపై పలు మండలాల ప్రజలు ఆర్డీవోకు అర్జీలు సమర్పించారు.

## భూసమస్యలు పరిష్కరించండి

గూడూరు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వివాదాస్పదంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని గూడూరు తహశీల్దార్ సి.వెంకటనారాయణమ్మకు ప్రజలు విన్నవించారు. సోమవారం ప్రజావిజ్ఞప్తుల సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన అర్జీదారులు సమస్యలను తెలుపుకున్నారు. ప్రధానంగా దీవిపాళెం, పోటుపాళెం, చెన్నూరు తదితర ప్రాంతాలకు చెందిన వారు అధికంగా వచ్చారు.

# శ్రీకాళహస్తి న్యూస్

### శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో...

## జాతీయ సాధు సమ్మేళనం



ప్రపంచఖ్యాతి ఆధ్యాత్మిక వేత్తగా విద్యాప్రకాశానందగిరిస్వాములవారి 102వ జయంతి ఉత్సవాలు ఈ నెల 3వతేదీ నుంచి 7వతేదీ వరకు జాతీయ సాధు సమ్మేళనం ఉత్సవాలుగా ఘనంగా నిర్వహించారు. చిత్తూరుజిల్లా శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు ఐదు రోజులు అత్యంత వైభవంగా శ్రీ శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు మాట్లాడుతూ దేశ నలుమూలల నుంచి పీఠాధిపతులు, మఠాధిపతులు, సన్యాసులు విచ్చేశారన్నారు. జాతీయ సాధుసమ్మేళనం ఘనంగా నిర్వహించామన్నారు. వారికి తగిన ఏర్పాట్లు చాలా చక్కగా నిర్వహించామన్నారు. మంగళవారం శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారి జన్మదినోత్సవం సందర్భంగా ఆశ్రమం వార్షికోత్సవంలో శంకరానందగిరి స్వాములవారి చేతుల మీదుగా "దక్షిణామూర్తి" పుస్తకావిష్కరణ చేశారు. చెడును వ్యాపింపచేయరాదన్నారు. అలాగే లగడపాటి రాజగోపాల్ "శివ కుటుంబ లీలలు" పుస్తకమును మలయాళ సద్గురుసేవా సమాజాధ్యక్షులు మహా మహోపాధ్యాయ డా॥ సముద్రాల లక్ష్మణయ్య ఆవిష్కరించారు. అమ్మ ఆశ్రమ అధ్యక్షురాలు పి. భూలక్ష్మి ఆశ్రమంలో భక్తి గీతాలు పాడి భక్తులను అలరించారు. అలాగే బహుదూర్ పేట వాస్తవ్యులు కూడా భక్తిరంజని గీతాలు ఆలపించి భక్తులను మైమరపించారు. ఆశ్రమం వారు నిర్వహించిన భగవద్గీత పోటీలలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. గోల్డ్ మేడల్ మొదటి బహుమతి శ్రీబాలాజీ పాఠశాలలో చదువు విద్యార్థిని ముక్తియార్ అక్బర్ బాదుషా మనుమరాలికు లభించింది. ద్వితీయ బహుమతి బాబు అగ్రహారం పాఠశాల విద్యార్థి వై.వి.బాలాజీలు దక్కించుకున్నారు. మొత్తం ప్రోత్సాహక బహుమతులు 24 మందికి విద్యార్థిని విద్యార్థులకు ఆశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరి స్వాములవారు అందచేశారు.

విద్యాప్రకాశానందగిరి స్వాములవారు 1913 ఏప్రిల్‌లో రామస్వామి గుప్తా, సుశీలాదేవి దంపతులకు కృష్ణాజిల్లా మచిలీపట్నంలో జన్మించారు. ఆయనకు తల్లి దండ్రులు పెట్టిన పేరు ఆనందమోహన్, బందర్ నోబెల్ కళాశాలలో బి.ఎ. పూర్తి చేసిన ఆయన కాశీ బెనారస్‌లో సంస్కృతంలో పట్టభద్రులయ్యారు. తండ్రి రామస్వామి వృత్తిరీత్యా న్యాయవాది అయినా ఆధ్యాత్మిక భావాలు కలిగినవారు. కుమారుడిలోనూ ఆధ్యాత్మికతపై మక్కువ పెరిగింది. ఏర్పేడు వ్యాసాశ్రమ స్థాపకులు మలయాళస్వామి వద్ద శిష్యరికం చేశారు. ఆయన ఉపదేశం మేరకు ఏర్పేడు వ్యాసాశ్రమంలో 12ఏళ్ల దీక్ష చేశారు. తద్వారా దివ్యజ్ఞానాన్ని ఆర్జించిన ఆనందమోహన్ విద్యాప్రకాశానంద గిరిస్వామిగా మారారు.

**శ్రీకాళహస్తిలో ఆశ్రమ స్థాపన :** గురువు ఆదేశం మేరకు విద్యాప్రకాశానందగిరి స్వామి శ్రీకాళహస్తిలో 1950లో శ్రీ శుకబ్రహ్మాశ్రమాన్ని స్థాపించారు. దాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దారు. 108 భగవద్గీత జ్ఞానయజ్ఞాలు, 58 గీతా సదస్సులు నిర్వహించి లక్షలాదిమందికి భగవద్గీతపై మక్కువ పెంచారు. భగవద్గీతకు గీతామకరందం పేరుతో అద్భుత వ్యాఖ్య రాసి జనానికి దగ్గర చేశారు. పుట్టపర్తి సత్యసాయి బాబాతో సన్నిహిత సంబంధాలు ఉండేవి. చివరి దశలో అంధత్వానికి గురైనా స్వామివారు తన ప్రవచనాలను నిరంతరాయంగా కొనసాగించారు.

**విద్యాలయాల స్థాపన :** శ్రీకాళహస్తిలో డిగ్రీ కళాశాల స్థాపనకు విద్యా ప్రకాశానందగిరి స్వామి భారీగా విరాళం అందచేశారు. విద్యాప్రకాశానందగిరి స్వామి పేరు మీద ఎస్పీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(పురుషులు), శ్రీకాళహస్తి బాలుర జూనియర్ కళాశాల, తొట్టంబేడు బాలికల జూనియర్ కళాశాలను నెలకొల్పారు.


**త్రినేత్ర వైద్యశాలలో నేత్రదానం :** స్వామివారు అవసానదశలో అంధత్వంతో బాధపడ్డారు. మరెవరూ తనలా ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో శుకబ్రహ్మాశ్రమంలోనే భక్తకన్నప్ప ఉచిత కంటి ఆస్పత్రిని స్థాపించారు. వేలాదిమంది పేదలకు ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. లక్ష రూపాయల వ్యయంతో ఆశ్రమానికి దక్షిణ దిక్కున విశాలమైన ఆస్పత్రిని నిర్మించారు. ఈశ్వరుడికి నేత్రాలను సమర్పించిన భక్తకన్నప్ప పేరుతో ఆస్పత్రిని ప్రారంభించారు.

**స్వామివారి ధ్యానమందిరం :** విద్యాప్రకాశానదగిరి స్వామివారు 84 ఏళ్ళ వయస్సులో పరమపదించారు. 1988లో ఆయన శివైక్యం పొందడంతో ఆశ్రమంలోనే సమాధి చేశారు. ఆ సమాధిపై టీటీడీ, భక్తుల సహకారంతో శివలింగాకారంలో ధ్యానమందిరాన్ని నిర్మించారు. ఇందులో స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.



ఈ కార్యక్రమంలో సంపూర్ణానందగిరి స్వాములవారు, దండి నిర్మలానందగిరి స్వాములవారు, డా॥ కరిబసవ రాజేంద్ర మహాస్వాములు, శ్రీహరి తీర్థస్వాములు, రామకోటి రామకృష్ణానందస్వాములు, శంకరానందగిరిస్వాములు, ప్రణవానందగిరి స్వాములు, యోగిని చంద్రకాళా ప్రసాదమాతాజీ, మాతా జ్యోతిర్మయానంద భారతి స్వామి, మాతా ప్రతిభానందగిరి స్వామి, బ్రహ్మానందగిరి స్వామి, కైలాసానందగిరి స్వామి, చంద్రశేఖర స్వామి, రామలాల శర్మ, కె.ఈశ్వర్‌లు పాల్గొన్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. రాజకీయ వర్గాలు ఇబ్బందులలో పడతాయి. ఉద్యోగులు అధికారులతోను, పబ్లిక్‌తోను జాగ్రత్తగా ప్రవర్తించండి. బంధు వర్గంలో ఒకరు అనారోగ్యం బారిన పడతారు. ఆర్థిక వ్యవహారాలలో, స్థిరాస్తుల వ్యవహారాలలో ముందు జాగ్రత్తతో ఉండండి. ఆదాయం సామాన్యం. అవసరాలకు ఋణం చేయవలసి రావచ్చును.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. వృత్తి వ్యాపారాలలో తీరిక ఉండదు. ఆదాయం అభివృద్ధి బాగుంటుంది. భూములు, పొలాలు కొనే విషయంలోను, కొత్త అగ్రిమెంట్లు, కాంట్రాక్టుల విషయంలో జాగ్రత్తలు తీసుకొనండి. తొందరపాటు నిర్ణయాలు చేసే అవకాశం ఉన్నది కాబట్టి జాగ్రత్త అవసరం. ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూ అవకాశలుంటాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

బిడ్డల విద్యా ఉద్యోగ విషయాలపై శ్రద్ధ చూపుతారు. శుభకార్య ప్రయత్నాలు ఆశాజనకంగా ఉంటాయి. చేపట్టిన పనులు నిదానంగా, సవ్యంగా జరుగుతున్నా టెన్షన్ పడుతుంటారు. వ్యవహారాలలో కొందరి ప్రవర్తన విసుగు, కోపం కలిగిస్తాయి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. మీ పనులందు మిత్రులు, పరిచయస్తులు సహాయం చేస్తారు. అధికారులకు తనిఖీలుంటాయి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

కోర్టు వ్యవహారాలలో వ్యతిరేకత ఉండవచ్చును. ఉద్యోగస్తులకు గుర్తింపు గౌరవాలు కార్యసామర్థ్యం బాగుంటుంది. అనుకున్న పనులను పట్టుదలతో సాధిస్తారు. స్వల్ప, అనుకోని విషయాలపై బంధు మిత్రులతో విభేదాలు పొడసూపగలవు. విద్యాప్రగతి బాగుండును. ఆర్థికాభివృద్ధి పథకాలు, ప్రణాళికలు రూపొందించుకుంటారు.



### బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 10.04.2015 నుండి
తేది. 16.04.2015 వరకు

ఈ వారంలో వృషభంలో శుక్రుడు, కర్కాటకంలో గురువు, కన్యలో రాహువు, వృశ్చికంలో శని, ధనుర్మకర కుంభ మీన రాశులలో చంద్రుడు, మీనంలో కేతు రవి బుధులు, 12తేది నుండి మేషంలో బుధుడు, 14తేది నుండి మేషంలో రవి, మేషంలో కుజుడు సంచరిస్తారు.

### పంచాంగము:

తేది 14 మంగళవారము తమిళులకు ఉగాది. సూర్యుడు మేషరాశి ప్రవేశము.

### ముహూర్తములు

తేది 10 శుక్రవారము ఉదయం గంట 9.30 నుండి గంట 10.30లోగా మిధున లగ్నమున ఉపనయన వివాహ, వ్యాపార ప్రారంభములు.

### చైత్ర మాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 10 | శుక్ర | షష్ఠి | రా॥ గం.7.30వ॥ |
| తేది. 11 | శని | సప్తమి | రా॥గం.6.11వ॥ |
| తేది. 12 | ఆది | అష్టమి | సా॥గం.4.33వ॥ |
| తేది. 13 | సోమ | నవమి | ప॥గం.2.38వ॥ |
| తేది. 14 | మంగళ | దశమి | ప॥గం.12.28వ॥ |
| తేది. 15 | బుధ | ఏకాదశి | ఉ॥గం.10.10వ॥ |
| తేది. 16 | గురు | ద్వాదశి | ఉ॥గం.7.46వ॥ |
| | పిదప | త్రయోదశి | రా॥గం.5.20వ॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. మీ నిర్ణయాలు, సూచనలు సమావేశాలలో ఆమోదం పెరుగుతుంది. వైద్య ఖర్చులు, బిల్లుల చెల్లింపులు తప్పనిసరిగా చేయవలసి వస్తుంది. కొత్త వ్యాపారాలకు, నూతన పెట్టుబడులకు ప్రయత్నాలు చేస్తారు. స్థిరాస్తుల లావాదేవీలలో ప్రముఖపాత్ర వహిస్తారు. ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూ అవకాశాలుంటాయి.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఉద్యోగులకు తమతమ విధులందు సామర్థ్యము, అధికారులకు స్థానమార్పు ఉండగలదు. శుభ కార్యములు నిర్ణయము, అవకాశాలు ఉద్యోగార్థులకు దొరకడం, హఠాత్తుగా ప్రయాణాలుంటాయి. ప్రభుత్వ పరంగా అనుమతులు ఆలస్యం కావడం, కోర్టు కేసులందు అనుకూలత బాగుంటుంది. వృత్తి వ్యాపారాలలో ఆదాయం బాగుంటుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తి వ్యాపారాలు ఆశాజనకంగా ఉండి ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. అనుకున్న పనులు జరుగుతున్నట్లే ఆశ కలిగిస్తాయి కాని జరగవు. వాహనాలు నడిపే వారు యంత్రాల పనులు చేసే వారు జాగ్రత్తగా ఉండాలి. స్పెక్యులేషన్ వ్యాపారాలు నిరాశ కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాలలో అనుకూలత, అనుకోని ప్రయాణాలు, సమాజసేవలో పాల్గొనడం జరుగుతుంది.


## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆదాయం పెరుగుతుంది. స్థిరాస్తులు, విలువైన వస్తువులు కొనేందుకు ప్రయత్నాలు జరగగలవు. వివాహాది శుభకార్యాలు నిర్ణయానికి రాగలవు. ప్రభుత్వ అనుమతులు, ఆఫీసు పనులందు అనుకూలత ఉంటుంది. కుటుంబ వ్యవహారాలు ఇబ్బంది పెడతాయి. సర్దుకొని పోవడం వల్ల సమస్యలు సర్దుకుంటాయి. విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపుతారు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ప్రయాణాలలో వస్తువులు, డబ్బు జాగ్రత్త. క్రొత్త పెట్టుబడులకు ఆహ్వానాలు లభిస్తాయి. వృత్తి వ్యాపారాలు బాగా సాగుతాయి. క్రొత్త పరిచయాలు కలగడం, బంధుమిత్రులను కలుసుకొనడం జరుగుతుంది. ఆర్థిక పరమైన అంచనాలు, ప్రణాళికలు మంచి ఫలితాన్నిస్తాయి. ఆదాయం పెరుగుతుంది. స్థిరాస్తుల లావాదేవీలను వాయిదా వేసికొనడం మంచిది. శుభకార్యాలు నిర్ణయం కావడానికి కృషి చేస్తారు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వ్యాపార భాగస్వామ్యానికి, కొత్త వ్యాపారాలకు ప్రయత్నాలు అనుకూలం కాగలవు. వ్యవహారాలలో తొందరపాటు మాటలు, ప్రవర్తనలో జాగ్రత్త పడండి. ఆర్థికాభివృద్ధికి చేసే ప్రయత్నాలు, ప్రణాళికలు మంచి ఫలితాన్నిస్తాయి. బంధువర్గంతో సత్సంబంధాలు నెలకొంటాయి. శుభకార్య ప్రయత్నాలు నిర్ణయం కావడం జరుగుతుంది. కార్యదక్షత బాగుంటుంది.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

స్థిరాస్తుల లావాదేవీలను వాయిదా వేసి కొనడం మంచిది. వాహనాలు నడిపేటప్పుడు, యంత్రాలు ఎలక్ట్రికల్ పనులందు జాగ్రత్త అవసరం. వృత్తి పరంగా వ్యాపకం ప్రాముఖ్యత ఉండి ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. వ్యాపార వర్గాలకు పెట్టుబడి అవకాశాలు అభివృద్ధి బాగుండి ఆదాయం బాగుంటుంది. విద్యావృద్ధి బాగుంటుంది. వ్యక్తిగత విమర్శలకు దూరంగా ఉండండి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

వ్యాపారవర్గాలకు మంచి అవకాశాలు చేజారి పోవచ్చును. ఉద్యోగులకు అధికారుల సహకారం బాగుంటుంది. కుటుంబంలో చిన్నపాటి ఇబ్బందులుండి సర్దుబాటు కాగలవు. వ్యాపార వర్గాలకు సామాన్య ఆదాయముంటుంది. స్థిరాస్తులు కొనే ప్రయత్నాలు జరుగవచ్చును. పొదుపు పథకాలు, నూతన పెట్టుబడులు ఆకర్షిస్తాయి. విద్యాప్రగతి బాగుంటుంది.



# మస్తాన్‌బాబుకు యూత్ కాంగ్రెస్ నివాళి

నెల్లూరుజిల్లా యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కేతిరెడ్డి వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో పర్వతారోహకుడు మల్లి మస్తాన్‌బాబు మృతికి శ్రద్ధాంజలి ఘటించి, నెల్లూరు ట్రంకురోడ్డు వద్దనున్న గాంధీబొమ్మ సెంటర్‌లో మస్తాన్‌బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి, కాంగ్రెస్ నగర ఇన్‌ఛార్జి ఏసి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### జర్నలిస్టుల ఆధ్వర్యంలో...

పర్వతారోహకుడు మల్లి మస్తాన్‌బాబు మృతికి ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా జర్నలిస్టులు నివాళులర్పించారు. సోమవారం నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో మల్లి మస్తాన్‌బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ది నెల్లూరు జర్నలిస్టు మ్యూచువల్ హౌసింగ్ సొసైటీ డైరెక్టర్లు, విలేకర్లు పాల్గొన్నారు.

# డికెడబ్ల్యూలో ఉచిత విద్య

నెల్లూరు దర్గామిట్టలోని డికెడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో 2015-16 విద్యా సంవత్సరంలో అర్హులైన వారికి ఫీజులు లేని ఉచితవిద్యను అందజేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నాక్-సి గుర్తింపు కలిగి డిగ్రీ, పీజీ కోర్సుల్లో ఉచితంగా విద్యను అందజేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాలకు చెందిన విద్యార్థినులు ఇక్కడకు వచ్చి విద్యనభ్యసిస్తుంటారని అన్నారు. ఆయా జిల్లాల్లోని ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ విద్యార్థులకు ఎలాంటి ఫీజు చెల్లించనవసరం లేకుండా ఉచిత విద్య, వారికి ప్రభుత్వ స్కాలర్‌షిప్ అందిస్తామని తెలిపారు. ఇంటర్ ఫలితాలు వెల్లడైన మరుసటిరోజు నుంచే ప్రవేశాలకు దరఖాస్తులు ఇస్తామన్నారు.



# చిరంజీవి యువత రక్తదానం

మెగాస్టార్ చిరంజీవి మేనల్లుడు స్టైలిష్‌స్టార్ అల్లు అర్జున్ జన్మదినం సందర్భంగా ఈ నెల 4వ తేదీ రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌లో చిరంజీవి యువత రక్తదాన శిబిరం నిర్వహించి అన్నదానం అనంతరం క్యాన్సర్ రోగుల మందుల నిమిత్తం రూ. 7వేలు నగదును ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిఎంహెచ్ఓ డా॥ భారతిరెడ్డి పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి యువత జిల్లా అధ్యక్షులు వై.రవికుమార్, నగర అధ్యక్షులు కృష్ణారెడ్డి, కార్యదర్శి కొట్టె వెంకటేశ్వర్లు, గౌరవఅధ్యక్షులు రాజ్‌కుమార్, అల్లు అర్జున్ జిల్లా అధ్యక్షులు వంశి, నగర అధ్యక్షులు వెంకటరమణ, రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్ డా॥ సి.వి.రమాదేవి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా॥ డి. పెంచలసుబ్బయ్య, మెడికల్ ఆఫీసర్లు డా॥ యస్.సాయినాథ్, డా॥ సి.వేమయ్య, చీఫ్ టెక్నాలజిస్ట్ డి.జీవన్, సిబ్బంది పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో ఈస్టర్ పండుగ

లోక పాపాల కోసం శుభశుక్రవారం శిలువపై మరణించిన ఏసుక్రీస్తు ఆదివారం వేకువజామున సమాధి నుంచి లేచిన సందర్భాన్ని పురస్కరించుకొని జరిగే ఈస్టర్(పునరుద్ధానం) వేడుకలను క్రైస్తవ సోదర సోదరీమణులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. క్రైస్తవులు భక్తిగీతాలను ఆలపిస్తూ తెల్లవారుజాము నుంచే చర్చీలకు చేరుకున్నారు. నగరంలోని చర్చిలు భక్తులతో నిండిపోయాయి.

సంతపేటలోని రోమన్ క్యాథలిక్ మిషన్ చర్చి, ఏబియం కాంపౌండులోని లోన్‌స్టార్ చర్చి, ఫత్తేఖాన్‌పేటలోని సెయింట్ ఆంథోని చర్చి, రైల్వేఫీడర్స్‌లోని ది లోన్‌స్టార్ చర్చి, విఆర్‌సి సెంటర్‌లోని డొనీహాలు చర్చి, కపాడిపాలెంలోని పునీత కానుక మాత చర్చి, పొదలకూరురోడ్డు వియానిహోం, వేదాయపాలెం తదితర ప్రాంతాల్లోని చర్చీలలో ఫాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

# గీతాంజలిలో ఆత్మీయ సమ్మేళనం

గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో 4వ తేదీ 2012, 2013 సంవత్సరాల్లో ఉత్తీర్ణులైన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా॥ జి.సుబ్బారావు మాట్లాడుతూ పూర్వవిద్యార్థులు, ప్రస్తుత విద్యార్థుల మధ్య ఆరోగ్యకరమైన సహకారపూరిత వాతావరణం నెలకొల్పటానికి తమ కళాశాల కృషి చేస్తుందన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎస్.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ వందమందికిపైగా పూర్వ విద్యార్థులు ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఆత్మీయసమ్మేళనంను ట్రిపుల్‌ఇ విభాగం అధ్యాపకుడు టి.రవి కుమార్, కళాశాల సీనియర్ ఆంగ్ల ఆచార్యులు జి.సతీష్ పాల్ పర్యవేక్షించారు.

ఈ కార్యక్రమంలో డివివియస్ ఫణికుమార్, వై.దినకర్, వెంకయ్య, పి.రాఘవరెడ్డి, జాహ్నవి, యస్.శ్రీధర్, బ్రహ్మానాయుడు, అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.



• శెభాష్ పోలీసు



# పరిమళించిన మానవత్వం

పోలీసులూ మనుషులే... వారిలోనూ మానవత్వముంటుంది. స్పందించే హృదయ ముంటుంది. సాయం చేసే గుణముంటుంది. మమతలు, మానవ సంబంధాలకు వాళ్ళు అతీతులు కారు. కాకపోతే నిద్ర లేచింది మొదలు క్రిమినల్స్ విషయంలో కఠినంగా వ్యవహరిస్తుండాలి కాబట్టి వారి బాడీ లాంగ్వేజ్ కరుకుగా వుంటుంది. ముఖ్యంగా మన తెలుగు సినిమాలైతే పోలీసులను విలన్లుగానూ, పోరంబోకు వేషాలేసే హీరోలను మంచి వాళ్ళుగానూ చూపిస్తుంటాయి.

పోలీసులూ మనుషులేనని, వారిలోనూ మానవత్వముంటుందని చాటిన మానవతా ఘటన బుధవారం నెల్లూరులో చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే... గుర్తు తెలియని ఓ యువకుడు చింతారెడ్డిపాలెం క్రాస్ నుండి ఎన్టీఆర్ నగర్ వైపు వాకింగ్ చేస్తూ వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తలకు బలమైన గాయమై ఆ యువకుడు అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. స్థానికుల సహకారంతో ఆ యువకుడిని దగ్గరలోనే వున్న సింహపురి ఆసుపత్రిలో చేర్చారు. బాలాజీనగర్ సిఐ బాజీజాన్ సైదా, ఎస్ఐ నాగేశ్వరరావులు ఆసుపత్రిలో ఆ యువకుడి పరిస్థితిపై వైద్యులతో చర్చించారు. తలకు బలమైన గాయమైందని, ఆపరేషన్ చేస్తే బ్రతుకుతాడని, ఆపరేషన్‌కు 5లక్షల ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. ఆ యువకుడి అడ్రస్ దొరుకుతుందేమోనని షర్ట్, ఫ్యాంట్ జేబులో చూడగా ఎటువంటి కాగితాలు దొరకలేదు. దీంతో ఆ యువకుడిని కాపాడే బాధ్యతను బాలాజీనగర్ పోలీసులే తీసుకున్నారు. ఈ విషయాన్ని కలెక్టర్, ఎస్పీ, డిఎం అండ్ హెచ్ఓల దృష్టికి తీసుకెళ్లారు. ఈ యువకుడి ఫోటోలను ఫేస్‌బుక్, వాట్సప్‌లలో కూడా పెట్టారు. స్థానిక ఛానెల్‌లో ఈ యువకుడి సమాచారాన్ని అందించారు. 5లక్షల ఆపరేషన్‌ను 3లక్షలకే చేసేందుకు ఆసుపత్రి వైద్యులు అంగీకరించారు. ఆ యువకుడి బంధువులు ఎవరూ రాకపోతే ఆ నగదుకు తాము గ్యారంటీ ఇస్తామని, అతని ప్రాణాలు కాపాడండని సిఐ బాజీజాన్‌సైదా, ఎస్ఐ నాగేశ్వరరావులు ఆసుపత్రి యాజమాన్యానికి భరోసా ఇచ్చారు. దీంతో వైద్యులు అతనికి ఆపరేషన్ చేసి ప్రాణాలు నిలిపారు. ఇక్కడ పోలీసులు సరైన సమయానికి స్పందించబట్టి ఒక ప్రాణాన్ని నిలపగలిగారు. సమయానుకూలంగా స్పందించడం అనేది చాలా విలువైనది. ఒక్కోసారి సకాలంలో స్పందించకుంటే జరిగే నష్టం చాలా తీవ్రంగా ఉంటుంది. పోలీసులు ఆ సమయానికి స్పందించకుండా మాకెందుకొచ్చిన తలనొప్పిలే అనుకుని వుంటే ఆ తర్వాత కొన్ని కోట్లిచ్చినా పోయిన ప్రాణం తేలేరుగా! డబ్బుకన్నా మనిషి ప్రాణం చాలా విలువైనది. లక్షల కోట్లు ముందేసినా కొనలేనిది ప్రాణం. ఈ విషయాన్ని అందరూ గమనించాలి. ఏ మనిషయినా ఆపదలో వున్నప్పుడు సాటి మనుషులు ఇదే విధంగా స్పందిస్తే ప్రతిచోటా మానవత్వం వెల్లివిరుస్తుంది.

# టోల్‌గేటు వద్దంటూ నాయకుల తీర్మానం

నెల్లూరురూరల్ పరిధిలోని కనుపర్తిపాడు సమీపంలో నేషనల్ హైవే వద్ద ఏర్పాటు చేయబోయే టోల్‌గేటు నిర్మాణాన్ని అడ్డుకుందామని నెల్లూరురూరల్, సిటి ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు అన్ని రాజకీయ పార్టీల నాయకులు తీర్మానం చేశారు. ప్రాణాలైనా అర్పిస్తానని, ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా టోల్ గేటు నిర్మాణాన్ని ఒప్పుకోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### జిఆర్ ట్రస్ట్

# స్మారక సాహితీ పురస్కారాల సభ

నెల్లూరు టౌన్‌హాలు వర్ధమాన సమాజంలో ఆదివారం జిఆర్ ట్రస్ట్ స్మారక సాహితీ పురస్కారాల సభ ట్రస్ట్ అధ్యక్షులు గుర్రాల రమణయ్య ఆధ్వర్యంలో జరిగింది. దివంగత గుర్రాల రమణమ్మపై గుర్రాల రమణయ్య వ్రాసిన కవిత అందరి కళ్లు చెమర్చేలా చేసింది. ఈ కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్.వి.రఘు, వీరప్రతాప్, సిరి మామిళ్ళ కోటేశ్వరరావు, కల్లూరు శేఖర్, డాక్టర్ జి.మురళీధర్, యెద్దల లలిత, గురిజాల సూరిబాబులకు ఆత్మీయ సన్మానం చేసారు. ఈ కార్యక్రమంలో పొత్తూరి సుబ్బారావు, కె.వి.నాగేశ్వరరావు, సర్వేపల్లి రామమూర్తి, బి.వి.నరసింహం, మద్దూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఆడవారిని అడ్డం పెట్టుకుని రాజకీయాలా?

## మాజీమేయర్ నందిమండలం భానుశ్రీ



మహిళలను అడ్డుపెట్టుకుని కొందరు రాజకీయ నాయకులు రాజకీయాలు చేస్తున్నారని, మగవాళ్లు బృహన్నల రాజకీయాలు మానుకోవాలని మాజీమేయర్ నందిమండలం భానుశ్రీ హితవు పలికారు. 2014 ఎన్నికల తర్వాత ఆమె నెల్లూరు రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. నెల్లూరులో కూడా కాకుండా కడపలో నివసిస్తున్నారు. కాని, ఇటీవల ప్రత్యర్థుల రాజకీయ విమర్శలలో తరచూ ఆమె పేరు వినిపిస్తుంది. దీంతో ఆమె నెల్లూరుకు రాక తప్పలేదు. బుధవారం నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ ప్రక్కన ఓ హోటల్‌లో విలేకర్లతో మాట్లాడుతూ తాను గత 22 ఏళ్ళుగా రాజకీయాల్లో ఉంటూ మూడు పర్యాయాలు కౌన్సిలర్‌గా గెలుపొందానని, ఉన్నట్టుండి తనకు మేయర్ పదవి రాలేదని, మహిళలకు కేటాయింపబడినందున ఆ అవకాశం తనకు దక్కిందన్నారు. మేయర్‌గా తాను 16నెలల కాలం పనిచేసి నగరాన్ని అభివృద్ధి పథంవైపు నడిపానన్నారు. నెల్లూరు రాజకీయాల్లో తనపేరును వాడుకోవడం ఫ్యాషన్‌గా మారిందన్నారు. తనంతటతాను రాజకీయాల్లోకి వచ్చానేగాని తనను ఎవరూ ప్రోత్సహించలేదన్నారు. గతంలో తనకు రూ.2కోట్లు ఇచ్చామని చెప్పినవారు నిజంగా ఇచ్చివుంటే వారి బిడ్డల మీద ప్రమాణం చేసి చెప్పాలని సవాల్ విసిరారు.

# కూలీల గుండెల్లో తూటా!

(మొదటిపేజీ తరువాయి)

కసబ్, అఫ్జల్‌గురు లాంటి ఉగ్రవాదులను ఏళ్ల తరబడి జైళ్లలో పెట్టి మేపడం కంటే ఇలా ఎన్‌కౌంటర్ చేయడమే మేలని సాధారణ జనం అభిప్రాయం. కాబట్టి వికారుద్దీన్ గ్యాంగ్ ఎన్‌కౌంటర్ విషయంలోనూ ప్రజల ఆలోచన ఇలాగే వుంటుంది తప్పితే ఇంకో విధంగా ఉంటుందని భావించలేము. కాని అదేరోజు చిత్తూరు జిల్లాలోని శేషాచలం అడవుల్లో ఆంధ్రా పోలీసులు చేసిన ఎన్‌కౌంటరే వివాదాస్పదంగా మారింది. మొత్తం 20మంది ఎర్రచందనం కూలీలు ఈ ఎన్‌కౌంటర్‌లో మరణించారు. వీళ్లంతా తమిళనాడు వాసులే! వీళ్లు స్మగ్లర్లు కారు, కరుడుగట్టిన టెర్రరిస్టులు, మావోయిస్టులు కాదు. ప్రజల మానప్రాణాలు దోచుకునే గజదొంగలు కాదు. కాని కోట్లు కొల్లగొట్టే ఎర్రచందనం స్మగ్లర్లు విసిరే కాసులకు ఆశపడి, చట్టాలు, శిక్షల గురించి తెలియక గొడ్డళ్లు చేతపట్టి ఎర్రచందనం చెట్లను నేల కూల్చడానికి వెళ్లి పోలీసు తుపాకీ గుండ్లకు నేలకొరిగారు. ఎర్రచందనం కూలీలపై పోలీసులు ఈ స్థాయిలో విరుచుకుపడతారని ఎవరూ ఊహించలేదు కూడా! అయితే ఇక్కడ ప్రభుత్వం తీరు గద్దలను వదిలేసి పిచ్చుకలను కొట్టిందనే విమర్శలు వస్తున్నాయి. ఒక్క ఎర్రచందనం స్మగ్లర్ కూడా పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మరణించలేదు. వాళ్ళు కోట్లు కొల్లగొట్టి దర్జాగా బతుకుతున్నారు. ఎన్‌కౌంటర్‌లో మరణించిన 20మంది కూడా కూలీ నాలి చేసుకుని బ్రతికే సన్నజీవులే!

ఎర్రచందనం చెట్లను నరకడానికి వెళితే ఇచ్చే కూలీ మొత్తం చాలా ఎక్కువగా వుంటుంది. వీళ్లు మామూలు పనులకు వెళితే రోజువారీ వచ్చే కూలీ 500రూపాయలకు మించదు. అదే ఎర్రచందనం కొట్టడానికి పోతే రోజు కూలీయే వేలల్లో ఉంటుంది. ఇక మద్యం, మాంసం వంటివి అదనంగా ఉంటాయి. వీటికి ఆశపడే తమిళనాడు నుండి వందల సంఖ్యలో కూలీలు వచ్చి శేషాచలం అడవుల్లో ఎర్రచందనం చెట్లను నరకసాగారు. రాష్ట్రంలో తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన కొత్తల్లో శేషాచలం అడవుల్లోనే ఎర్రచందనం కూలీలు తనిఖీకి వచ్చిన అటవీ శాఖ సిబ్బందిపై దాడికి తెగబడడం తెలిసిందే! ఆ దాడిలో ఇద్దరు అటవీ సిబ్బంది అసువులు బాసారు.

ఈ సంఘటనతో ఎర్రచందనం అక్రమరవాణాను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఎర్రచందనం అక్రమ రవాణాకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయడంతో పాటు అటవీ సిబ్బందికి ఆయుధాలిచ్చింది. గత కొన్ని నెలల్లోనే శేషాచలం అడవుల్లో వందలాదిమంది ఎర్రచందనం కూలీలను పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే దీనికి సంబంధించిన చట్టాలు బలంగా లేకపోవడంతో వాళ్లు వెంటనే బయటకు రావడం, మళ్లీ గొడ్డళ్లు పట్టుకుని ఎర్రచందనం వేటకు పోవడం రివాజైంది. ముఖ్యంగా తమిళనాడు నుండే వందల సంఖ్యలో కూలీలు దిగసాగారు.

కేసులు అరెస్ట్‌లతో వీరిని కట్టడి చేయడం కష్టమని భావించిన పోలీసులు ఇక తూటాలతోనే దీనికి ముగింపు పలకాలని భావించినట్లుంది. 20మందిని ఎన్‌కౌంటర్‌లో చంపారు.

ఇక ఈ ఎన్‌కౌంటర్‌పై మానవ హక్కుల సంఘాలతో పాటు రాజకీయ పార్టీలు కూడా తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి. తమిళనాడు ప్రభుత్వం సీరియస్ అయ్యింది. తమిళ పార్టీలు, తమిళ ప్రజా సంఘాలు ఆందోళనకు దిగాయి. ఈ సంఘటనతో ఆంధ్రా-తమిళనాడు మధ్య సంబంధాలు కొంతవరకు బెడిసినట్లే! అయితే ఈ విషయంలో సర్వత్రా వినిపించే విషయం ఒక్కటే... ఎర్రచందనం అక్రమ రవాణాతో వేలకోట్లు కొల్లగొట్టిన గద్దలను వదిలేసి పిచ్చుకల్లాంటి కూలీల మీద తూటా(బ్రహ్మాస్త్రాలు) ప్రయోగిస్తే లాభముంటుందా...? అని!

# కమ్మర్షియల్ రాజధాని!

(మొదటిపేజీ తరువాయి)

అడుక్కునే పరిస్థితుల్లోవుంది. కొత్త రాజధాని కట్టాలంటే మాటలు కాదు. వేల కోట్లతో పని. కొత్తగా రాజధాని కట్టే బదులు గుంటూరు, కృష్ణాజిల్లాలో మూతపడే దిశలో వున్న ఇంజనీరింగ్ కాలేజీలను, ఇతర భవనాలను కొనేసి అక్కడ నుండే పరిపాలన సాగించవచ్చు కదా. ఈ కొత్త రాజధాని నిర్మాణానికి వెచ్చించే సమయాన్ని పరిపాలనపై పెడితే, రాష్ట్రంలో పరిస్థితులన్నా కొంత కుదుటపడతాయనేది చాలామంది భావన.

చంద్రబాబుకు ఇవన్నీ తెలియకనా? కాని ఆయన ఆలోచన వేరు. ఆచరణ వేరు. ప్రజలు ఎక్కడ ఛస్తే ఆయనకేంటి, ఆయన పరిపాలన చేయాలంటే సింగపూర్ నగరం లాంటి రాజధాని వుండాలి. అందులో ఉద్యానవనాలు, ఆకాశాన్నంటే భవనాలు, మాల్స్, మల్టిప్లెక్స్‌లు, మెట్రో రైల్, సింగపూర్‌కు అరగంటకొకసారి విమానాలుండేలా ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు వుండాలి. రాజధాని విషయంలో చంద్రబాబు పైకి చెప్పే అంశాలివి.

కాని ఏపి రాజధానిని ఒక కుల ప్రాతిపదిక రాజధానిగా, ఓ వర్గ ప్రాబల్యానికి వేదికగా, ఆర్థిక వ్యవహారాల కేంద్రంగా తీర్చిదిద్దడమే అసలు లక్ష్యం. రాజధానిలో రెండు అంశాలు కీలకం కానున్నాయి. ఒకటి ఒక సామాజిక వర్గం ప్రాబల్యాన్ని పెంచడం. కృష్ణా-గుంటూరు జిల్లాలో కమ్మ సామాజికవర్గం ఆధిపత్యం చూపిస్తుంది. 1983 నుండి కూడా తెలుగుదేశం పార్టీకి ప్రధాన వెన్నుదన్నుగా నిలుస్తున్నది ఈ సామాజికవర్గమే. 2014 ఎన్నికల్లో కూడా తెలుగుదేశంపార్టీకి ఈ రెండు జిల్లాలలో సీట్లు అధికంగా వచ్చాయి. కాబట్టే చంద్రబాబు ఇక్కడ రాజధానికి మొగ్గు చూపారు. ఒక సామాజిక వర్గాన్ని రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం చేయడం కోసం పంట పొలాల్లో రాజధాని వద్దన్న శివరామకృష్ణన్ కమిటీ నివేదికను సైతం బుట్టదాఖలు చేశారు. మేధావుల హెచ్చరికలను పెడచెవిన పెట్టారు. రాజధాని కోసం సేకరించిన భూములతో ఇప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారం మొదలు పెట్టబోతున్నారు. సింగపూర్‌తో పాటు చంద్రబాబు అనుయాయుల చేతుల్లో వున్న కంపెనీలు ఇప్పుడు డెవలపర్స్ రూపం ఎత్తబోతున్నాయి. ఇవే రాజధాని భూములను జాయింట్ డెవలప్‌మెంట్ పేరుతో తీసుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయనున్నాయి. రాజధాని పేరుతో తుళ్లూరులో కులకమర్షియల్ రాజ్యం నడువబోతుంది. భారత దేశ చరిత్రలోనే ఇలాంటిది జరిగి వుండదు.

# బాలాజీ జిల్లా

(మొదటిపేజీ తరువాయి)

మాత్రం నెల్లూరు జిల్లాలోని తడ, సూళ్లూరుపేట ప్రాంతాలే! అలాగే నాయుడుపేట మండలంలో మేనకూరు సెజ్ కూడా పారిశ్రామికంగా అభివృద్ధి చెందబోతుంది. కృష్ణపట్నం పోర్టు, శ్రీసిటీ సెజ్, మేనకూరు సెజ్... ఈ మూడే నెల్లూరుజిల్లా ప్రగతి సూచికలు.

అయితే చంద్రబాబు ఇప్పుడు వాటికి ఎసరు పెడుతున్నట్లుగా తెలుస్తుంది. తిరుపతి కేంద్రంగా బాలాజీ జిల్లాను ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఎప్పటి నుండో వుంది. ఇప్పుడు ఆ డిమాండ్‌ను నెరవేర్చడానికి చంద్రబాబు శ్రీకారం చుట్టనున్నాడని సమాచారం. తిరుపతి లోక్‌సభ పరిధిలో నెల్లూరు జిల్లాలోని సూళ్లూరుపేట, వెంకటగిరి, సర్వేపల్లి, గూడూరు నియోజకవర్గాలున్నాయి. ఇక చిత్తూరుజిల్లాలోని సత్యవేడు, తిరుపతి, శ్రీకాళహస్తి అసెంబ్లీలు కూడా తిరుపతి లోక్‌సభలో ఉన్నాయి. వీటికి నగరి, పుత్తూరు నియోజకవర్గాలను జత చేసి బాలాజీ జిల్లాను ఏర్పాటు చేయాలనే దిశగా ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ఇదే జరిగితే నెల్లూరుజిల్లాకు పారిశ్రామికంగా వెన్నెముకగా నిలుస్తున్న కృష్ణపట్నం పోర్టు, శ్రీసిటీ, మేనకూరు సెజ్, మన్నవరం 'భెల్' ఫ్యాక్టరీ అన్నీ బాలాజీ జిల్లాలోకి వెళ్లే అవకాశాలున్నాయి. అలాగే కండ్లేరు పూర్తిగా పోవడంతో పాటు సోమశిల రిజర్వాయర్ దక్షిణభాగం కూడా బాలాజీ జిల్లా పరిధిలోకి పోతుంది. అప్పుడు నెల్లూరుజిల్లాకు పారిశ్రామికంగా, సాగునీటి పరంగా చిప్పు మిగులుతుంది.

నెల్లూరుజిల్లా అభివృద్ధికి ఇవే ప్రధాన మార్గాలు. వీటిని మనం కోల్పోతే నెల్లూరుజిల్లా రూపురేఖలే మారిపోతాయి. తస్మాత్ జాగ్రత్త!

# నెల్లూరు దోమలకు గ్లోబల్ టెండర్లు

శ్రీను గల్పిక

ఐఆర్ 20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమల ఉత్పత్తికి ప్రసిద్ధిగాంచిన నెల్లూరు నగరం. అందులోనూ నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో కౌన్సిల్ హాల్. నైట్‌రైడర్, ముదురు దోమల శాఖ మంత్రి పి.నారాయణ, ఆయనకు ఓ పక్క మేయర్ అబ్దుల్ అజీజ్, కమిషనర్ చక్రధర్ బాబు, ఇంకోపక్క కలెక్టర్ ఎం.జానకి కూర్చుని వున్నారు. నారాయణ మాట్లాడుతూ... రాష్ట్రంలో మీకంటే చిన్నచిన్న మున్సిపాల్టీలు పన్నుల వసూళ్లలో ముందుంటున్నాయి. మీరెందుకు సక్రమంగా పన్నులు వసూలు చేయడం లేదని మేయర్‌ను ఆగ్రహంగా ప్రశ్నించారు. దానికి మేయర్ స్పందిస్తూ... మేమూ వసూలు చేయాలనే చూస్తున్నాం సార్, పన్నులు కట్టమని ప్రజలను బ్రతిమలాడుతున్నాం, భంగపడుతున్నాం, చేతులు కాళ్లు పట్టుకుంటున్నాం, వీలైతే బెదిరింపులకు కూడా దిగుతున్నాం. వాళ్లు కడితేగా... పన్నులు కట్టమని పోతే తరుముకుంటున్నారు సార్ అని చెప్పాడు. వాళ్లకు నా పేరు చెప్పకపోయారా అని నారాయణ అన్నాడు. అప్పటికీ చెబుతున్నాం సార్ అని అజీజ్ అన్నాడు. నా పేరు వినగానే పన్నులు కడతామంటున్నారా అని నారాయణ ఆత్రుతగా అడిగాడు. లేదు... పన్ను లడిగితే పళ్లు రాలగొడతామంటున్నార్సార్ అని అజీజ్ చెప్పాడు. వెంటనే నారాయణ... నెల్లూరు ప్రజలకు ఇంత ధైర్యం ఎక్కడ నుండి వచ్చింది. వీళ్ల వెనుక ఏదో అదృశ్య శక్తి వుంది. ఆ అదృశ్యశక్తి వారి వెనుక ఉన్నంత కాలం వారిని ఎవరూ ఏమీ చేయలేరు. మనకు ప్రజలు పన్నులు కట్టకుండా అడ్డుకుంటున్నదెవరు? నాకిప్పుడే తెలియాలి, ఇక్కడే తెలియాలి అని ఆవేశంగా అంటూ నారాయణ బల్ల గుద్ది అడిగాడు. పన్నులు వసూలు కాకుండా అడ్డుకున్న అదృశ్య శక్తి ఈ సిడిలో ఉంది చూడండి సార్ అంటూ తెలుగుదేశంపార్టీ అధికార ప్రతినిధి, డివిజన్ కమిటీ ఛైర్మెన్ జడ్.శివప్రసాద్ చేతిలో ఒక సిడి పట్టుకుని లేచాడు. వెంటనే నారాయణ ఆ సిడిని తెప్పించుకుని తన ల్యాప్‌టాప్‌లో పెట్టి ఓపెన్ చేశాడు.

★★★★★


అది నెల్లూరు శివార్లలోని వెంకటేశ్వరపురం ప్రాంతం. ఆ సందుల్లో ఓ ఆటోలో మైక్ అనౌన్స్‌మెంట్ ఇలా వుంది... "నగర ప్రజలకు విజ్ఞప్తి, నెల్లూరు నగర పాలక సంస్థకు మీరు కట్టాల్సిన ఇంటి పన్నులు, నీటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులను వెంటనే చెల్లించండి... అలా చెల్లించకపోతే మీ ఆస్తులను జప్తు చేస్తాం, మీ కొళాయి కనెక్షన్‌లను పీకేస్తాం, మీ వీధుల్లో లైట్లను తీసేస్తాం.. వెంటనే పన్నులు కట్టండి" అనే హెచ్చరికలు అనౌన్స్‌మెంట్ రాసాగింది. అప్పుడే ఆ సందులోకి స్టైల్ ఆఫ్ సింహపురి, మాజీఎమ్మెల్యే ఆనం వివేకా(64) వచ్చాడు. ఖాకీఫ్యాంట్, ఖాకీ షర్ట్‌తో మెడలో ఎర్రటవల్ వేసుకుని అచ్చం నిప్పురవ్వ సినిమాలో బాలకృష్ణ మాదిరిగా ఉన్నాడు. ఆయన వెనుక కాలనీవాసులంతా వస్తున్నారు. బ్యాక్‌గ్రౌండ్‌లో 'రండి తరలిరండి ఉద్యమంలా తరలిరండి, ఉప్పెనలా ఉరికిరండి, గనుల నుండి, కనుల నుండి కార్మికుల చెమట నుండి" అనే విప్లవగీతం రాసాగింది. ఆటో దాకా వచ్చాక ఉన్నట్లుండి వివేకాతో పాటు అందరూ ఆ ఆటోపై రాళ్లు విసరసాగారు. అదిగో అజీజ్ వచ్చాడు.. తరమండి అంటూ వివేకా హుషారుగా అరవడంతో అందరూ ఆ ఆటోను వెంటపడి తరిమారు. ఆటో ఏ సందులోకి పోతే ఆ సందులోకి వివేకా బ్యాచ్ పోవడంతో ఇక అక్కడ తిరగలేక ఆటో వెళ్లిపోయింది. వివేకా అక్కడే ఓ టిఫిన్ కొట్టు వద్ద కూర్చున్నాడు. అక్కడ ఓ మహిళ స్టౌమీద బాణలిలో నూనె పోసి బోండాలు వేయడానికి పిండి కలుపుతుంది. వివేకా ఆమె వద్ద కూర్చుని, నీకు శ్రమ ఎందుకక్కా, ఆ పిండి ఇటివ్వు, బోండాలు నేనేస్తాను అని అన్నాడు. ఆ మహిళ వివేకా వైపు చూసింది... ఒళ్లంతా చెమట పట్టి వుంది, ఎండ దెబ్బకు ఆయన చేతులు కూడా చెమటలు కారుతున్నాయి. నీ చేతులతో బోండాలు వేయడం చూస్తే రోజూ వచ్చే కస్టమర్లు పూర్తిగా రాకుండా ఎగ్గొడతారు అని మనసులో అనుకుంటూ... వద్దులే అన్నా, మీరేంటి, మీ లెవలేంటి, ఇక్కడ బోండాలు వేయడమేంటి, నాపనేంటో నేను చేసుకుంటానులే నాయనా అని అంది. బోండాలు తినడానికి లేని లెవల్, బోండాలు వేయడానికెందుకొస్తుందక్కా, అంటూ వివేకా పిండిని లాక్కుని బాణలిలోని సలసల కాగే నూనెలో క్రికెట్ బాలంత బోండాలు వేసాడు. ఆ మహిళ మనసులో ఇంత లావు బోండాలు అమ్మితే నేను నెత్తిన గుడ్డేసుకోవాల్సిందే అని మనసులో అనుకుంది. అంతలో ఓ 70ఏళ్ల ముసలాయన అటు వెళుతుండగా, వివేకా ఆపాడు. ఎక్కడకు వెళుతున్నావని అడిగాడు. దానికి ఆ పెద్దాయన... ఈ మున్సిపాల్టీ వాళ్లు రోజూ ఇంటి ముందు ఆటోను నిలబెట్టి పన్నులు కడతారా లేదా అంటూ మైకులో అడిగిందే అడుగుతున్నారు. ఆ సొద పడలేకే ఇంటి పన్ను కడదామని వెళుతున్నానన్నాడు. వెంటనే వివేకా... ఇంటి పన్ను ఏం కడతావుగాని, పళ్లు లేనట్లున్నాయి, ముందు ఆ డబ్బుతో పళ్లసెట్టు కట్టించుకో, నీకాడికి ఎవడన్నా పన్నులు కట్టమని వస్తే నా పేరు చెప్పి లాగి కొట్టు, ఇదిగో ఇది పట్టు అంటూ ఆ పెద్దాయన చేతిలో బోండా పెట్టాడు. ఆ పెద్దాయన దానిని చూసి... ఈ క్రికెట్ బంతిని నేనేం చేసుకునేది నాయనా, పిల్లకాయలకివ్వండి, ఆడుకోన్నా ఆడుకుంటారన్నాడు. పెద్దాయన ఇది బంతి కాదు, బోండా, నేనే స్వయంగా వేసాను. తిను. తిన్నాక కూడా ఉన్నావంటే నువ్వు అదృష్టవంతుడివి, లేకుంటే నీ వాళ్లు అదృష్టవంతులు అంటూ వివేకా అక్కడి నుండి లేచాడు.

★★★★★

ఇక్కడితో సిడి అయిపోయింది. నారాయణ వుండి... ప్రజలు మనకు పన్నులు కట్టకుండా అడ్డుకుంటున్న అదృశ్య శక్తి వివేకా అన్నమాట. ఇతనిని బ్రతిమలాడి చూడండి... పన్నులు కట్టకుండా ప్రజలను ఆపొద్దని అభ్యర్థించండి అని నారాయణ అన్నాడు. వెంటనే అజీజ్ రియాక్టై... అలా చేస్తే ఆయన ముందు మనం వీకవుతాం సార్, అలా కాకుండా ఇంకో మార్గం చూడండన్నాడు. నారాయణ ఆవేదనగా... రాష్ట్రం కోసం చంద్రబాబు భిక్షమెత్తుతున్నాడు. ప్రత్యేక విమానంలో పలు దేశాలు తిరుగుతూ ప్రత్యేకంగా అడుక్కుంటున్నాడు. ఇచ్చిన హామీలను అమలు చేయడానికి ఆఖరకు ఎర్రచందనం కూడా వేలానికి పెట్టిన త్యాగమూర్తి చంద్రబాబు... రాష్ట్రం కోసం ఆయన ఇంత త్యాగం చేస్తుండగా, నెల్లూరు మున్సిపల్ ఆదాయం పెంచడానికి మనమేం చేయలేమా అని ప్రశ్నించాడు. అప్పుడు అజీజ్ లేచి... మీరు ఎర్రచందనం వేలం అంటే గుర్తొచ్చింది సార్, పన్నుల కోసం ఎవరినీ అడుక్కుతినే అవసరం లేకుండానే కార్పొరేషన్ ఆదాయం పెంచొచ్చు... మన నెల్లూరు దోమలకు ప్రపంచ వ్యాప్తంగా మంచి డిమాండ్ వుంది. అమెరికా, చైనా, జపాన్, రష్యా వంటి దేశాలు మన దోమలు కావాలని కోరుతున్నాయి. ముదురు దోమలకు గ్లోబల్ టెండర్లు పిలుద్దాం, ఏ దేశం ఎక్కువ రేటుకు కోట్ చేస్తే ఆ దేశానికి ఇచ్చి, వచ్చిన ఆదాయాన్ని నెల్లూరు నగరపాలక సంస్థకు జమ చేద్దాం. అందరినీ అడుక్కునే బాధ తప్పుతుంది. ఆదాయం లేని లోటు తీరుతుందని చెప్పాడు. అది విని నారాయణ... అజీజ్, నీకూ రాజకీయ లక్షణాలు బాగా వంటబట్టాయి. నాకంటే ఫాస్ట్‌గా వున్నావు, అలాగే గ్లోబల్ టెండర్లకు ప్రాసెస్ రెడీ చెయ్... అంటూ లేచాడు.

## కదంబం

### ఊరెళ్లి రావాలి



ఏటూరి నాగేంద్రరావు
నెల్లూరు. 7416665323

ఇక్కడ పరిచయాలక్కర్లేదు.
పిడికెడు మనసుంటే చాలు.
అందరికి నువ్వు కావల్సిన వాడివే!
ఊరికి చెరువు నాడి
ఊళ్లో పూటబావులు నాడి
దాహానికి మజ్జిగే అందిస్తాయి.
గుండె వేలాడేసుకున్న గుమ్మాలు
ఇక్కడ ప్రతి అతిథి స్వయం విష్ణువే...
చేలల్లో పంటలు పండినట్టే
గుండెల్లో మమతలు పండుతాయిక్కడ!
సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం దాకా
స్వేదగంగా స్నానాలే తప్ప
చెట్టు నీడనెరగని
శ్రామిక మునుల తపోభూమే!
ఊరంటే, ఊరి జనమంటే
స్వచ్ఛంగా ప్రవహించే సెలయేరే!
పరమాణుపాదం ఆక్రమించాక
గుండెల్లో బాధలేని రోబోలే మిగిలాయి పట్నంలో
పట్నమంటే యిప్పుడు
మాంసపు యంత్రాల సంత
స్వార్థ శేషుని పడగ నీడలో
సొంత పేర్లు మరిచిపోయిన
చిరునామాలు పట్నమంటే!
మనిషిని సందర్శించాలంటే
ఊరెళ్లి రావాల్సిందే!

## పొట్టేపాళెంలో శ్రీ కోదండరాముని రథోత్సవం



నెల్లూరు రూరల్ మండల పరిధిలో వున్న పొట్టేపాళెం గ్రామంలో వెలసిన శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన స్వామివారి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయ అర్చకులు కులశేఖరాచార్లు, వేద పండితులు శేషాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రథంలో స్వామివార్లను వేంచేపు చేశారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఈ రథోత్సవంలో పాల్గొని స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవానికి బండి శ్రీకాంత్ మిత్రబృందం ఉభయకర్తలుగా వ్యవహరించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి సైతం వందలాదిగా విచ్చేసిన భక్తులు స్వామివార్లను దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు స్వామివారి రథాన్ని ముందుకు లాగుతూ, రథోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులురెడ్డి ఉత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## ఆలయంలో అన్నదానం



ఈ నెల 5న నెల్లూరు నగరంలోని మూలాపేట చాముండివారి తోటలో వున్న శ్రీ పాండురంగస్వామి వారి ఆలయంలో నెల్లూరు నగర శాసనసభ్యులు డా॥ పి.అనిల్‌కుమార్‌యాదవ్ ప్రత్యేకపూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు టి.ఆర్.గుణశేఖర్, గుర్రం మధుసూదనరావు, తిరవత్తూరు శివకుమార్, హరి, టి.సునీల్‌కుమార్, ఎ.జనార్ధనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పద్యకళాపరిషత్ ఆధ్వర్యంలో 15 నుంచి

## ఆంధ్ర మహాభారత ఉపన్యాసాలు



నెల్లూరులోని పద్యకళాపరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు ఆంధ్ర మహాభారత ఉపన్యాసాలు జరుగనున్నాయి. నెల్లూరు టౌన్‌హాలులో సాయంత్రం 6 నుంచి జరిగే ఈ కార్యక్రమాల్లో తొలిరోజైన 15న 'అశ్వమేధ పర్వము -ప్రథమాశ్వాసము' అనే అంశంపై 'రామాయణ రత్నాకర' బిరుదాంకితులు కేశాప్రగడ సత్యనారాయణ (రాజమహేంద్రవరం) ఉపన్యసిస్తారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్ విచ్చేస్తారు. హోటల్ అభిరామ్ అధినేత పచ్చిపులుసు శ్రీరాములు సభాపోషకులుగా వ్యవహరిస్తారు. పద్యకళాపరిషత్ నిర్వాహకులు మెట్టు రామచంద్ర ప్రసాద్, ఆచార్య శ్రీమతి కె. మెహర్మణి, ఎం.వేణుగోపాలయ్య, బివి నరసింహం, ఆచార్య సిహెచ్ వెంకటేశ్వరరావు, కె.సుందరరామయ్య, పి. వెంకటేశ్వర్లు, నలుబోలు బలరామయ్య నాయుడు తదితరులు పాల్గొంటారు. 16న జరిగే కార్యక్రమంలో అశ్వమేధ పర్వము-ద్వితీయాశ్వాసాన్ని కేశాప్రగడగారు వివరిస్తారు. నగరపాలక సంస్థ కమిషనర్ కెవిఎన్ చక్రధర బాబు విశిష్టఅతిథులుగా పాల్గొంటారు. ఈ సభకు ప్రముఖ పారిశ్రామికవేత్త కొండా సత్యనారాయణ సభా పోషకులుగా వ్యవహరిస్తారు.

17న అశ్వమేధపర్వము-తృతీయాశ్వాసం ఉపన్యాస కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.సుదర్శనరెడ్డి విశిష్ట అతిథిగా, కెవిఎస్ఎన్ మూర్తి(లక్ష్మీనారాయణ ఇంజనీరింగ్ కార్పొరేషన్) ముఖ్యఅతిథిగా పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. 18న జరిగే కార్యక్రమంలో అశ్వమేధ పర్వము-చతుర్థాశ్వాసాన్ని కేశాప్రగడగారు వివరిస్తారు. విశిష్ట అతిథిగా ఆర్టీఓ పివి సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి పాల్గొంటారని, జిల్లా అర్బన్ వాసవీ సేవా సమితి వ్యవస్థాపకులు పెండేల సురేంద్ర సభాపోషకులుగా వ్యవహరిస్తారని నిర్వాహకులు పేర్కొన్నారు.

సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు, ప్రజలందరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# ఏడు ఖండాల కొండల్లో మువ్వన్నెల జెండా!

## – నేలకొరిగిన 'సాహస శిఖరం'..మల్లి మస్తాన్‌బాబు

*ప్రపంచంలోని దుర్భేద్యమైన పలు పర్వత శిఖరాలను సైతం అధిరోహించి, ఏడు ఖండాల కొండల్లో మువ్వన్నెల జెండాను రెపరెలాడించిన మహా సాహసికుడు, ప్రపంచ ప్రఖ్యాత పర్వతారోహకుడు మల్లి మస్తాన్‌బాబు. ఎవరెస్ట్ శిఖరాన్ని సైతం అధిరోహించిన తొలి తెలుగు బిడ్డ..మల్లి మస్తాన్‌బాబు. ప్రపంచంలోని ఎన్నో ఎత్తయిన పర్వతశిఖరాలను ఎంతో శ్రమకోర్చి అధిరోహించి, భారతదేశానికి ఎనలేని కీర్తిప్రతిష్టలను తెచ్చిన మహా సాహసిక పర్వతయాత్రికుడు...మల్లి మస్తాన్‌బాబు. చిలీలోని పర్వతశ్రేణుల్లో..ఆయన సాహసయానంలోనే నేలకొరిగిపోవడం దేశానికి దిగ్భ్రాంతిని కలిగించింది. సర్వత్రా ప్రజలందరికీ ఆయన మరణవార్త కన్నీరు తెప్పించింది.*



మల్లి మస్తాన్‌బాబుకు తొలినుంచీ పర్వతారోహణ అంటే మక్కువ ఎక్కువ. అదే ఆయనకు ప్రపంచస్థాయి పర్వతారోహకునిగా,, అత్యంత సాహసయాత్రికునిగా ప్రఖ్యాతిని తెచ్చిపెట్టింది. కేవలం ఏడు నెలల కాలంలోనే ఏడు ఖండాల్లోని పర్వతాలను సైతం అధిరోహించి ఆయన రికార్డు సాధించారు. ఆయన ఘనవిజయాలెన్నో వున్నాయి. 2006 జనవరి19 నుంచి జులై17 మధ్య రోజుల్లో, ప్రపంచంలోని ఏడు ఖండాల్లో ఒక్కోరోజు ఒక్కో పర్వత శిఖరాన్ని అధిరోహించి, పర్వతారోహణలో రికార్డులెన్నో సాధించి అత్యున్నతమైన సాహసికునిగా, పర్వతారోహకునిగా ప్రపంచంలో భారతదేశ కీర్తి పతాకాన్ని రెపరెపలాడించాడు. ఆయన ఈ జిల్లాలో జన్మించడం జిల్లా చేసుకున్న అదృష్టమనే చెప్పాలి. సింహపురి సీమ కీర్తిచంద్రికలను దశదిశలా మార్మోగించిన మల్లిబాబు సింహపురి ముద్దుబిడ్డ కావడం..సింహపురి సీమకే గర్వకారణం. అయితే, దురదృష్టం.. కేవలం 42 సంవత్సరాల వయసులోనే ప్రపంచవ్యాప్తంగా విఖ్యాతి పొందుతున్న మల్లిబాబును చూసి విధికి కన్నుకుట్టిందో ఏమో... నిర్దాక్షిణ్యంగా ఆయనను మృత్యు ఒడిలోకి నెట్టివేసింది. తన సాహస యాత్రలో భాగంగా మల్లిబాబు, చిలీ దేశంలోని ఆండీస్ పర్వతాలను అధిరోహిస్తున్న సందర్భంలో.. ఆయన మృత్యువాత పడ్డారు. ఆయన మరణవార్త విని దేశం దిగ్భ్రాంతి చెందింది. అంతటి సాహసికుడు మరణించారన్న సమాచారాన్ని జీర్ణించుకోలేక ఆయన్ను తెలిసినవారంతా పెద్దపెట్టున విలపించారు. నెల్లూరు జిల్లాలోని సంగం మండలంలోని గాంధీజన సంఘం అనే మారుమూల కుగ్రామంలో జన్మించి, స్వయంకృషితో పట్టుదలతో పర్వతారోహణలో అత్యంత ప్రతిభ సాధించి, అనేక పర్వత శిఖరాగ్రాలను అధిరోహించిన మల్లి మస్తాన్‌బాబు.. ఆ పర్వతాల్లోనే కుప్పకూలిపోయాడు. మృత్యువు ఒడికి చేరిపోయాడు. దీంతో, జిల్లా వాసులు, ప్రత్యేకించి ఆయన జన్మించిన గాంధీజనసంఘం ప్రజలే కాక, దేశ ప్రజలంతా ఆయన మరణవార్త విని కంటతడిపెట్టారు. చిలీ దేశంలోని ఆండీస్ పర్వతాలను అధిరోహిస్తూనే.. ఆ సాహసయానంలోనే మృత్యు కౌగిలికి చేరిపోయాడు. అత్యంత దు:ఖదాయకమైన ఆయన మరణవార్త అందరినీ కలచి వేసింది. కన్నీరు పెట్టించింది. ఆయన భౌతికదేహం ఇంకా తన పుట్టిన పూరైన గాంధీజన సంఘానికి చేరుకోలేదు. మల్లిబాబు మరణవార్తతో ఆ గ్రామం శోక సాగరమే అయింది. ఈ గడ్డమీద పుట్టిన ఆణిముత్యం మా మల్లి.. మట్టిలో మాణిక్యం మా మల్లి.. అంటూ ఆయనను తలచుకుని ఆ గ్రామంలోని ప్రతిఒక్కరూ కంటికి కడివెడు కన్నీరు పెడుతున్నారు. కుటుంబ సభ్యులంతా పుట్టెడు శోకంతో కుమిలిపోతున్నారు. ఆ పల్లె అంతా మల్లిబాబు రాకకోసం ఎదురుచూస్తూ విషాదంతో తల్లడిల్లిపోతోంది.. నిమిషమొక యుగంగా ఎదురుచూస్తోంది. ఆయనను కడసారైనా కళ్ళారా చూడాలని తపిస్తోంది.

### ఎన్నెన్నో ఉన్నత చదువులు :

ప్రపంచ ప్రఖ్యాత పర్వతారోహకుడైన మల్లి మస్తాన్‌బాబు చదువులోనూ ఉన్నత శ్రేణిలో రాణించాడు. చదువులోనూ సత్తా చూపుతూ ఒక్కొక్క మెట్టూ పైకెదిగి, జన్మనిచ్చిన తల్లిదండ్రులకూ, జన్మభూమికి ఎనలేని కీర్తి ప్రతిష్టలు తెచ్చాడు. నెల్లూరు జిల్లా సంగంలో ప్రైవేటు పాఠశాలలో ప్రాథమిక విద్యను చదువుకుని, ఆ తర్వాత కోరుకొండ సైనిక స్కూల్లో ఇంటర్ చదువుకున్నారు. 1992లో జంషెడ్‌పూర్‌లోని నిట్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదివాడు, అనంతరం ఖరగ్‌పూర్‌లో ఐఐటిలో ఎంటెక్ పూర్తి చేసి, 2002-04లో కోల్‌కతాలోని ఐఐఎంలో ఉన్నత విద్య చదువుకున్నారు. 1998 నుంచి 2000 దాకా సత్యం కంప్యూటర్స్‌లో ఉన్నతోద్యోగిగా పనిచేశారు.

### మరెన్నో పర్వతారోహణలు :

మల్లి మస్తాన్‌బాబు ప్రపంచ విఖ్యాతి గాంచారంటే ఆయన కృషి, పట్టుదల, దీక్ష అసాధారణమైనవనే చెప్పాలి. కోరుకొండ సైనిక పాఠశాలలో చదువుకుంటున్నప్పుడు తన పూర్వ విద్యార్థి అయిన ఉదయకుమార్ శిలావిగ్రహాన్ని చూసి, ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించే సమయంలో ఉదయ్ ప్రాణాలు కోల్పోయాడని తెలుసుకున్నాడు. ఉదయ్ ఆశయాన్ని తానూ కొనసాగించాలనే పట్టుదల కలగడంతో ఆనాటి నుంచి ఆ ప్రేరణతో ఆయన పర్వతారోహణలు చేయడం ప్రారంభించాడు. ఈ ఆశయ సాధనలో తానూ అమరుడైతే, తన విగ్రహాన్ని అక్కడ ఏర్పాటుచేస్తారని కూడా ఆయన అంటుండడం యాధృచ్ఛికమే అయినా, ఇప్పుడా మాటలు అందరినీ కంటతడిపెట్టిస్తున్నాయి. మస్తాన్‌బాబు తన సాహసయానంలో ఎన్నెన్నో పర్వతాలను అధిరోహించి దేశకీర్తి బావుటాను రెపరెపలాడించాడు.

2006లో జనవరి 19న అంటార్కిటికా ఖండంలో 4897 మీటర్ల ఎత్తు వున్న విన్సన్‌మాసిఫ్ పర్వత శిఖరాన్ని అధిరోహించాడు. అదేవిధంగా, అదే ఏడాది ఫిబ్రవరి 17న దక్షిణ అమెరికా ఖండంలో 6962 మీటర్ల ఎత్తు వున్న అకాన్‌కాగ్వా పర్వతశిఖరాన్ని, మార్చి 15న ఆఫ్రికా ఖండంలో 5895 మీటర్ల ఎత్తు వున్న కిలిమంజారో పర్వతాగ్రాన్నీ, ఏప్రిల్ 1న ఆస్ట్రేలియా ఖండంలో 2228 మీటర్ల ఎత్తు వున్న కోస్‌క్యూస్కో పర్వత శిఖరాన్నీ, మే 21న ఆసియా ఖండంలో 8850 మీటర్ల ఎత్తు వున్న ఎవరెస్ట్ శిఖరాన్ని, జూన్ 13న ఐరోపా ఖండంలో 5642 మీటర్ల ఎత్తు వున్న ఎల్‌బ్రూస్ శిఖరాన్నీ, జూలై 10న ఉత్తర అమెరికా ఖండంలో 6194 మీటర్ల ఎత్తు వున్న డెనాలీ పర్వత శిఖరాన్నీ అధిరోహించి గిన్నిస్ బుక్‌లో చోటు సాధించాడు. ఏడు ఖండాల్లో దిగ్విజయంగా దుర్భేద్యమైన పర్వతశిఖరాలను సైతం అధిరోహించి, పర్వతారోహణలో తిరుగులేని రారాజుగా, సాహస శిఖరంగా వెలుగొందిన మస్తాన్‌బాబు, గత నెల 21వ తేదిన చిలీ దేశంలోని ఆండీస్ పర్వతాలను అధిరోహించేందుకు వెళ్లారు. దురదృష్టవశత్తూ ఆ సమయానికి ఆ పర్వతాల్లో భారీవర్షాలు కురవడం, హిమనదులు ఉప్పొంగి వాతావరణమంతా ప్రతికూలంగా మారడంతో, మస్తాన్‌బాబు సాహస యానం విషాదయాత్రగా ముగిసి వుంటుందని భావిస్తున్నారు. ఈ అరుదైన మహాసాహసికుడు.. మస్తాన్‌బాబు మృతి సమాచారం తెలుసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రి వెంకయ్యానాయుడుతో సహా అనేక మంది ప్రముఖులు తమ తీవ్ర విచారాన్ని వెలిబుచ్చారు. మల్లిబాబు మృతదేహాన్ని చిలీలోని ఆండీస్ పర్వతాల మీది నుంచి కిందికి తీసుకువచ్చి, తిరిగి ఆయన స్వస్థలమైన నెల్లూరుజిల్లాలోని గాంధీజన సంఘం గ్రామానికి తీసుకు వచ్చేందుకు రాష్ట్ర, కేంద్రప్రభుత్వాలు తీసుకుంటున్న శ్రద్ధ అపారం. త్వరలోనే ఆ సాహసయాత్రికుని పార్థివదేహం ఇక్కడకు వస్తుందని ప్రజలంతా ఎదురు చూస్తున్నారు. ప్రపంచంలోని అనేక మహ పర్వతాగ్రాలను అధిరోహించిన ఆ సాహసికుని, తన అద్భుత సాహసాలతో దేశానికి ఎనలేని కీర్తిప్రతిష్టలు తెచ్చిన ఆ మహోన్నత చరితుని కడసారి కన్నులారా చూసేందుకు అందరూ ప్రతిక్షణం ఎదురుచూస్తూనే వున్నారు. మల్లి మస్తాన్‌బాబు మరణంతో ఈ గ్రామం బిడ్డను కోల్పోయిన తల్లిలా గర్భశోకంతో తల్లడిల్లుతోంది. మంచి మనస్తత్వం, ఆత్మీయతానురాగాలు కలగలిసిన వ్యక్తిత్వం.. మేరుపర్వతం లాంటి ఔన్నత్యం గల మస్తాన్‌బాబు ఇక లేడనే మాటను ఎవరూ జీర్ణించుకోలేకపోతున్నారు. ఇంత చిన్నవయసులోనే ఎంతో పేరు తెచ్చుకున్న మల్లి.. ప్రపంచ పర్వతారోహణలో చరిత్రలో మకుటాయమానమే!... ఏదేమైనా ఒక సాహస శిఖరం నేలకొరిగిపోయింది. ప్రపంచవ్యాప్తంగా గుభాళించిన ఓ సాహసాల మల్లి.. ఈ నేల అంతటా స్నేహ పరిమళాలను నింపిన ఒక జాజిమల్లి... నేల రాలిపోయింది. కుగ్రామంలో పుట్టినా, అనితరసాధ్యమైన పట్టుదలతో, కృషితో.. ఖండఖండాంతరాల్లో భరతజాతి కీర్తిప్రతిష్టలను రెపరెపలాడించిన సింహపురి ముద్దుబిడ్డ మల్లి మస్తాన్‌బాబుకు.. 'లాయర్' అశ్రు నయనాలతో నివాళులర్పిస్తోంది.

# నా భక్తిని శంకించొద్దు



- వివేకా

తనకు ఏ మతమైనా సమ్మతమేనని, అన్ని మతాల విశ్వాసాలను తాను గౌరవిస్తానని పిసిసి ఉపాధ్యక్షులు, మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి చెప్పుకొచ్చారు. బుధవారం నెల్లూరు వైఎంసిఏ గ్రౌండ్‌లోని విఆర్ ఐపిఎస్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎంసిఏ గ్రౌండ్ ముందు ఏర్పాటు చేసిన జీసెస్ విగ్రహాన్ని రాజకీయం చేయడం తగదన్నారు. వైఎంసిఏ నుండి ఈ స్థలాన్ని విఆర్ విద్యాసంస్థలు కొనుగోలు చేసాయని, వైఎంసిఏ వారి కోసమే ఇక్కడ జీసెస్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నేను 20ఏళ్లు నెల్లూరు ప్రజాప్రతినిధిగా పని చేసాను, నా హయాంలో ఆలయాలు, చర్చిలు, మసీదుల అభివృద్ధికి కృషి చేశాను. వేణుగోపాలస్వామి ఆలయంలో 75కపిలగోవుల్ని పెంచుతూ గోసంరక్షణకు పాటుపడుతున్నాను. హిందూ సంస్కృతి పరిరక్షకులమని చెప్పుకునే బీజేపీ, భజరంగ్‌దళ్, విహెచ్‌పి, ఆరెస్సెస్ వాళ్లు ఒక్క ఆవునైనా పెంచుతున్నారా అని ఆయన ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు దీనిపై ఒత్తిళ్లు తెస్తున్నారు. ఎన్ని శాఖలు ఉన్నాయో అన్నింటి ద్వారా విచారణలు జరిపిస్తూ మానసిక క్షోభకు గురిచేస్తున్నారు. వీళ్ల పేదల కోసం నడిచే ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యాసంస్థలపై చేసే పోరాటమేదో కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలపై చేస్తే అవి బాగుపడతాయని చెప్పారు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com